# 4

# క్రీస్తు రెండవ రాకడ

# (3:1–16)

ఆయన సందేశం ఇటీవలి ప్రత్యక్షతకు సంబంధించింది కాదనే విషయాన్ని పేతురు మామూలు మాటల్లో మనకు తెలియజెప్పాడు. అపొస్తలుల సందేశం తన పాఠకులకు రక్షణ తెచ్చిపెట్టింది. ఆయన సంబోధించిన సంఘములు సత్యమును ఎరిగియుండెను; నిజముగా అవి సత్యములో స్థాపింపబడినవై యుండెను (1:12). ఇంతలో అబద్ధ బోధకులు చొచ్చారు. వారు సంఘాలను చీల్చి చెండాడారు. కొందరు క్రైస్తవులు వారిని అంగీకరించారు లేదా వారిని కనీసం సహించారు; వారి బోధల ధ్వనింపులను యింకా ఎక్కువ స్పష్టంగా అర్థం చేసుకున్న ఇతరులు వారిని నిరాకరించారు. ఈ పత్రికను వ్రాయడంలో అపొస్తలుని మనస్సులో రెండు ఉద్దేశాలుండినవి: (1) అబద్ధ బోధకులు వారిని కొల్లగొట్టుచుండిరని తన పాఠకులను ఒప్పించాలని ఆశించాడు. అంత కంటే ఎక్కువగా, వారు అపొస్తలత్వ సందేశముతో దాని గుర్తింపును మించి రాజీపడుచుండిరి. (2) వారి పిలుపునకు గల శక్తిని మరియు పరిశుద్ధతను వారికి గుర్తుచేయడం ద్వారా ఆయన తన పాఠకులను ప్రోత్సాహించాలని ఆశించాడు. వారి విశ్వాసంలో వారిని బలపర్చాలని ఆశించాడు. ఆయన యొద్ద నూతనమైన మరియు ఆకర్షణీయమైన సందేశం ఏదీ లేదనే విషయాన్ని పేతురు స్పష్టంగా చెప్పాడు. సత్యాలను వారికి గుర్తుచేయడం, వారిని పురికొల్పడమే ఆయన ధ్యేయమై యుండింది. వారు దేవుని ప్రజలుగా కొనసాగవలెనని కోరుచున్నట్లయితే, అబద్ధ బోధకులను సమర్థించకుండా తోసిపుచ్చుతూ వారు అపొస్తలుల ద్వారా వినిన సందేశము పట్ల వారి నిబద్ధతను పునర్దృఢీకరించడమనేది అత్యావశ్యకమై యున్నది.

### "నిర్మలమైన మీ మనస్సులను రేపుచున్నాను" (3:1, 2)

**[1]ప్రియులారా, యీ రెండవ పత్రిక మీకిప్పుడు వ్రాయుచున్నాను [2]పరిశుద్ధ ప్రవక్తలచేత పూర్వమందు పలుకబడిన మాటలను, ప్రభువైన రక్షకుడు మీ అపొస్తలుల ద్వారా ఇచ్చిన ఆజ్ఞను మీరు జ్ఞాపకముచేసికొనవలెనను విషయమును మీకు జ్ఞాపకముచేసి, నిర్మలమైన మీ మనస్సులను రేపుచున్నాను.**

**వచనము 1. ప్రియులారా** అనే పదం సంబంధిత స్వర ధ్వనిలో ఒక మార్పును సూచిస్తుంది. ఈ పత్రిక అబద్ధ బోధకుల విషయంలో పట్టువిడవకుండా నిరసిస్తూ, సమాధానపరచు ప్రోత్సాహము దిశగా కొనసాగుతుంది. సందర్భవశంగా, ఇది ఆయన వారికి వ్రాసిన **రెండవ పత్రిక** అని అపొస్తలుడు పేర్కొన్నాడు. ప్రామాణిక గ్రంథాలు ప్రస్తుతము ఏర్పాటుచేయబడిన విధంగా, ఆధునిక పాఠకుడు వెంటనే పేతురు మొదటి పత్రిక గూర్చి ఆలోచిస్తాడు. తొలి పాఠకులతో నుండిన అనుసంధానం అంత స్పష్టమైందిగా

ఉండియుండకపోవచ్చు. వారు ఒకటి రెండు పుటలు వెనుకకు త్రిప్పి పేతురు మొదటి పత్రికను కనుగొనలేదు. ఇంకా ఎక్కువ విశ్లేషణ జరిపింపబడినట్లయితే అపొస్తలుడు సూచించుచుండింది పేతురు మొదటి పత్రిక కాదేమోనన్న నిశ్చయతను అది ఆధునిక పాఠకునికి కలుగజేయవచ్చు. అయితే ఈ శ్రోతలకు పేతురు ఇంతకు మునుపు ఒక ఉత్తరం వ్రాసాడనే విషయాన్ని మాత్రం మనము కచ్చితంగా చెప్పవచ్చు. కాని అది పేతురు మొదటి పత్రికయేనా అనే విషయాన్ని మనము కచ్చితంగా చెప్పలేము.

ఈ ఉత్తరము, పేతురు రెండవ పత్రిక, మునుపటి దాని వలెనే, **మీరు జ్ఞాపకము చేసికొనవలెనను విషయమును మీకు జ్ఞాపకముచేసి, నిర్మలమైన మీ మనస్సులను రేపుట** కొరకు ఉద్దేశింపబడిందని అపొస్తలుడు సెలవిస్తున్నాడు. పేతురు రెండవ పత్రికలో, ఆయన యేసుతో సంబంధం కలిగియుండిన సమయాల్లో సంభవించిన సంఘటనలను పునస్మరణ చేయడం ద్వారా తన పాఠకులకు జ్ఞాపకము చేసాడు. ఇంద్రియ సుఖాసక్త విషయకముకాని జీవితమును ప్రభువు కోరుచున్నాడని ఆయన వారికి జ్ఞాపకం చేసాడు. వారిలోనికి అక్రమంగా చొరబడిన అబద్ధ బోధకులను వారు ఆలింగనము చేసుకున్నట్లయితే ఏర్పడు పర్యవసానముల గూర్చి ఆయన వారికి జ్ఞాపకము చేసాడు.

ఆయన ఒక మంచి ఆత్మసంబంధమైన నాయకుడై యుండుటనుబట్టి, తన పాఠకులందరినీ ఒకే కోణంలో పరిగణించడంలేదనే విషయాన్ని పేతురు స్పష్టంగా తెలియజెప్పాడు. వారిలో అనేకులు శ్రద్ధాళువుగలవారై యుండిరి. వారు అబద్ధ బోధకులను వ్యతిరేకించారు; వారి ఒప్పింపులలో మనఃపూర్వకమైనవారై యుండిరి. గనుక వారిని ప్రోత్సాహించాలని పేతురు ఆశించాడు. వారికి జ్ఞాపకంచేయవలెనను తన కోరిక పేర్కొనబడటం 1:12ను గుర్తుకు తెచ్చుచున్నది. అపొస్తలుడు సున్నితమైన సమతౌల్యముగా నున్న చర్యను చేపట్టవలసి యుండింది. ఒక ప్రక్క ఆయన అబద్ధ బోధకులపై తనకు అందుబాటులో నున్న సమస్త తీవ్రతతో నేరారోపణ చేయగోరుచుండెను, కాని మరొక ప్రక్క ఆయన తన పాఠకుల వివేకాన్ని లేదా నిజాయితీని అవమానపరచ నొల్లకపోయాడు.

ఈ వాక్యభాగములోను మరియు 1:12లోను అంతర్నిహితమైన ఒక విమర్శ కలదు. అపొస్తలత్వ సాక్షుల నుంచి వారు పొందిన సందేశము గూర్చి తన పాఠకులకు జ్ఞాపకం చేయవలసిన అవసరముండింది. వారు "సత్యమందు స్థిరపరచబడియున్నారనియు" (1:12), వారు "నిర్మలమైన మనస్సు" కలిగియుండిరను తన ఆత్మవిశ్వాసమును వ్యక్తం చేయడం ద్వారా ఆయన తన గద్దింపును మెత్తబర్చాడు. ఈ విషయంతో అపొస్తలుడు వ్యవహరిస్తున్న తీరు నుంచి ఆత్మసంబంధమైన నాయకులుగా ఉండాలని ఆకాంక్షించువారు ప్రాముఖ్యమైన పాఠములు నేర్చుకొనవచ్చు. సమస్తాన్ని ఇముడ్చుకునే నిరసన, ఆశించిన ప్రయోజనాలను అంతగా ప్రభావితం చేయకపోవచ్చు. ఎవరైనాగాని సత్యము విషయంలో స్పష్టంగా ఉంటూ దాని కోసం నిలవబడవచ్చు, కాని ఒకని మట్టుమర్యాద ఆశింపబడు ఫలితము సాధింపబడుటలో ఎంతగానో దోహదపడటానికి అనువైనదై యుండాలి.

**వచనము 2**. అబద్ధ బోధకుల నోట ఇటీవలనే వెలువడగా తన పాఠకులు వినిన మాటలు మరియు వారి తొలి క్రైస్తవ బోధకుల నోట వినిన సందేశము మధ్య గల ప్రత్యేకతను చూపించుట పేతురు కొనసాగిస్తున్నాడు. **పూర్వమందు పలుకబడిన మాటలు వారు జ్ఞాపకముంచుకొనవలెనని** వారిని ఒప్పించాలని ఆయన ఆశిస్తున్నాడు. వారు పొందిన

మాటలు, మొట్టమొదటిగా, దేవుడు మునుపు **పరిశుద్ధ ప్రవక్తల ద్వారా** సెలవిచ్చిన సందేశమై యుండింది. పాత నిబంధనలోని ప్రవక్తలు నోరు తెరచి మాటలాడుటకు పరిశుద్ధాత్మ చేత ప్రేరేపింపబడ్డారనే విషయాన్ని పేతురు అదివరకే చెప్పాడు (1:21). దీనికి తోడుగా, అపొస్తలుల నోట వారు వినిన సందేశం, "పరిశుద్ధ ప్రవక్తల" చేత మాటలాడబడిన సందేశం యొక్క నెరవేర్పు యుండింది. "పాత నిబంధనకు ప్రక్కప్రక్కనే ఉంచబడుటకు క్రైస్తవ ఉపదేశముల యొక్క అధికారపూర్వకమైన శరీరము నిర్మింపబడు ప్రక్రియ అదివరకే ఆరంభమయ్యిందని ప్రవచనాత్మకమైన జోస్యమును యేసు సెలవిచ్చిన ఆజ్ఞలతో జోడించడం తేటపర్చుతోంది" అని డొనాల్డ్ గుత్రీ గమనించాడు.[1]

ఈ వచనములో గల పేతురు గ్రీకు భాష ఎబ్బెట్టుగా ఉన్నప్పటికిని, అర్థం చాలినంత స్పష్టంగా ఉన్నది. అక్షరాలా, ప్రవక్తల చేత పూర్వము పలుకబడిన మాటలు "ప్రభువైన రక్షకుడు, మీ అపొస్తలుల ద్వారా ఇచ్చిన ఆజ్ఞలై యున్నవని" ఆయన చెప్పుచున్నాడు. పేతురు పాఠకులు ఆజ్ఞల గూర్చి అపొస్తలుల నోట వినియున్నప్పటికిని, అవి వాస్తవమునకు, ప్రభువును రక్షకుడునైనవాని ఆజ్ఞలై యుండినవనేది ఈ మాటల్లోగల భావమై యున్నట్టు అగుపిస్తుంది. ఈ ఆజ్ఞలు అపొస్తలులు సెలవిచ్చినవై యుండినవనేది మరొక సాధ్యతయై యున్నది. అపొస్తలులు, వారి వంతుకు, ప్రభువును రక్షకుడునైనవాని చేత ఏర్పరచుకొనబడి పంపబడినవారై యుండిరి. ప్రస్తుత సందర్భానికి ఈ రెండు భావాలు చక్కగా సరిపోతాయి, మరియు ఒక దాని నుంచి మరొకటి చెప్పుకోదగినంత భిన్నంగా లేవు.

అపొస్తలులను పేతురు **మీ అపొస్తలులుగా** గుర్తిస్తున్నాడు. పైకి అర్థంకాని కారణాలు గాని ప్రయోజనాలుగాని ఈ అపొస్తలులకు లేకుండినవి. వారు క్రైస్తవులను వాణిజ్య సరుకుగా వాడుకొనలేదు; వారు విశ్వాసులకు నష్టం కలిగిస్తూనే వారి వ్యక్తిగత లాభాన్ని బలవంతంగా రాబట్టుకొనలేదు. అపొస్తలులు ప్రభువు మహిమార్థమై మరియు మానవుల రక్షణ కొరకు గాక, ఇతరమైన ఏ హేతువు నిమిత్తమైనను వారి పనులు చేయలేదు. వారు "మీ అపొస్తలులు" అయియుండిరి. అవసరమైనప్పుడు పేతురు అపొస్తలులు వారిని ప్రేమిస్తూ వారికి పరిచర్య చేయుచుండిరని ఆయన తన పాఠకులకు జ్ఞాపకం చేయాలని ఆశిస్తున్నాడు. అబద్ధ బోధకులు, మరొక ప్రక్క, తమ సొంత లాభం కొరకు వారిని కొల్లగొట్టారు (2:3, 15). అట్లయినను, అధికారమునకు సంబంధించిన అంశము పొంతనలేనిది కాదు. ప్రవచనాత్మకమైన రచనలు, అపొస్తలుల ఆజ్ఞలు, మరియు యేసు ఆజ్ఞలకును మరియు సిద్ధాంతములు మరియు తన పాఠకుల యెదుట అబద్ధ బోధకులు ప్రదర్శించిన జీవిత విధానములకును మధ్య గల తారతమ్యమును ఆయన చూపించాడు.

సత్యమునకు సంబంధించిన ప్రశ్నలు సమస్యయై యుండినప్పుడు, అబద్ధ బోధకులు ప్రదర్శించుచుండిన విచారకరమైన నైతిక జీవితములు తాత్కాలికముగా పక్కదారి పట్టవచ్చు. క్రీస్తు రక్షణ మార్గము, లేదా క్రీస్తు సంఘమును గూర్చిన విషయములోనైతే, మార్గనిర్దేశనము నిమిత్తము క్రైస్తవులు అపొస్తలిక బోధల వైపు చూడాల్సిన అవసరముండింది. అపొస్తలులను పేతురు "మీ అపొస్తలులు"గా గుర్తించాడు ఎందుకనగా విశ్వాసుల ఆత్మసంబంధమైన అభివృద్ధి వారి మొట్టమొదటి ఆందోళనయై యుండింది. దైవికంగా ప్రేరేపింపబడిన వారి చేత అందజేయబడిన వస్తుగతమైన సత్యమును గూర్చి మరియు అపొస్తలులకును తన పాఠకులకును మధ్య చేపట్టబడిన వ్యక్తిగతమైన అన్యోన్య చర్య గూర్చిన విన్నపమును ఆయన

జోడించాడు. వ్యక్తిగతమైన అంశము క్రైస్తవ నాయకత్వము నుంచి వేరుచేయబడజాలదు. మంచి కాపరుల వలె, అపొస్తలులు వారిని ప్రేమించారు మరియు సేవించారు.

వారికి **ఆజ్ఞ** ఇచ్చిన ఈ "అపొస్తలులు" ఎవరై యుండిరి? వారు, మొట్టమొదటిగా, ప్రభువు చేత ఏర్పరచుకొనబడి పంపబడిన పన్నెండు మందియై యుండిరి. ఈ పన్నెండు మంది, వారి వంతుకు, ఇతరులకు నేర్పించి వారు కూడ వెళ్లి ఇతరులకు నేర్పించునట్లు వారిని నియమించారు.[2] తన పాఠకులకు సువార్తను మొట్టమొదట బోధించింది ఈ పన్నెండు మందిలో నుండి వచ్చినవారై యుందురు లేదా ఈ పన్నెండు మంది పంపించిన వారిలో నుండి వచ్చినవారైనా అయియుందురని పేతురు భావించియుండవచ్చు. సందేశము ఆదిలో అపొస్తలికమైనదై యుండుటయే ఎక్కువ ముఖ్యమైన విషయం, అంతేగాని యేసును గూర్చి వారికి మొదట బోధించింది ఎవరై యుండిరన్నది ముఖ్యం కాదు.

### "ఆయన రాకడను గూర్చిన వాగ్దానమేమాయెను" (3:3-7)

**3అంత్యదినములలో అపహాసకులు అపహసించుచువచ్చి, తమ స్వకీయ దురాశలచొప్పున నడుచుకొనుచు, 4-ఆయన రాకడను గూర్చిన వాగ్దానమేమాయెను? పితరులు నిద్రించినది మొదలుకొని సమస్తమును సృష్టి ఆరంభముననున్నట్టే నిలిచి యున్నదే అని చెప్పుదురని మొదట మీరు తెలిసికొనవలెను. 5ఏలయనగా పూర్వమునుండి ఆకాశముండెననియు, నీళ్లలో నుండియు నీళ్లవలనను సమకూర్చబడిన భూమియు దేవుని వాక్యమువలన కలిగెననియు వారు బుద్ధిపూర్వకముగా మరతురు. 6ఆ నీళ్లవలన అప్పుడున్న లోకము నీటివరదలో మునిగి నశించెను. 7అయితే ఇప్పుడున్న ఆకాశమును భూమియు భక్తిహీనుల తీర్పును నాశనమును జరుగు దినమువరకు అగ్నికొరకు నిలువచేయబడినవై, అదే వాక్యమువలన భద్రముచేయబడియున్నవి.**

అబద్ధ బోధకులు బోధించిన సిద్ధాంతములకు సంబంధించినంత వరకు వాటి వివరాల విషయమై పేతురు ఎక్కువ లోతుల్లోనికి వెళ్లడం లేదు, గనుక ప్రభువు తిరిగి వచ్చుననే విషయాన్ని వారు ఒప్పుకొనలేదని చెప్పుకొనడం క్షేమదాయకమవుతుంది. దేవుని కుడిచేతి వైపున కూర్చుండి సమస్తమును ఏలుటకు పరమునకు చేర్చుకొనబడిన ప్రభువు తిరిగి వచ్చునని నూతనంగా క్రీస్తు నంగీకరించుచుండిన వారికి ఆది మిషనెరీలు అభయమొసగారు. ఇంతేగాక, ఆయన త్వరలో రానైయున్నాడు (యాకోబు 5:8; 1 పేతురు 4:7). "త్వరలో" అనే మాట సంబంధ వాచకమై యున్నది, కొద్ది సంవత్సరములలోనే, లేదా మహా అయితే కొన్ని దశాబ్దములలోనే క్రీస్తు తిరిగి వచ్చునని అనేకులు ఎదురుచూచారనడంలో సందేహమేమియు లేదు. కాలము గతించిపోయింది కాని యేసు తిరిగి రాలేదు. గనుక యేసు యిక మీదట తిరిగి రానేరాడని రూఢిగా చెప్పగల స్వప్రయోజనార్థమై ప్రయోజనపడు విఫలమైన ఈ ఎదురుచూపును అబద్ధ బోధకులు సద్వినియోగం చేసుకున్నారు. వాస్తవానికి, దీనికి ప్రత్యామ్నాయంగా, ప్రభువు ఇదివరకే ఏదో ఆత్మసంబంధమైన, అక్షరార్థములేని అవగాహన చొప్పున తిరిగి వచ్చాడని కొందరు వాదించారు. ఉదాహరణ వారు బాప్తిస్మము పొందినప్పుడు ప్రభువు వారి నిమిత్తము వ్యక్తిగతంగా వచ్చాడని వారు చెప్పియుందురు.

పేతురుకు ఇవేమి పట్టింపు లేదు. ప్రభువు తిరిగి వచ్చినప్పుడు ఎవరును సందేహించరని అపొస్తలుడు స్పష్టంగా చెప్పుచున్నాడు. దేవుడు లోకమును గతంలో తీర్పు తీ ర్చిన విధంగానే, ఆయన మరలా తీర్పు తీర్చును.

**వచనము 3**. వారనుకొనని సమయంలో, వారనుకొనని విధంగా ప్రభువు రాకడ సంభవించినట్లయితే ఎవరును అబ్బురపడకూడదు ఎందుకనగా క్రైస్తవుల నడుమ అబద్ధ బోధకులు చెలరేగియున్నారు. పౌలు ఇతర క్రైస్తవులను హెచ్చరించినట్లే, అబద్ధ బోధకులు తలెత్తుదురని పేతురు తన పాఠకులను హెచ్చరించాడు (అపొస్తలుల కార్యములు 20:29–31; 1 తిమోతి 4 చూడుము). ఆంగ్లము తెలిసినవారికి, **అపహాసకులు అపహసించుచు వచ్చి** అనే మాటలు మితిమీరినవై యున్నట్టు ధ్వనిస్తాయి, కాని హెబ్రీ భాషలో అభివ్యక్తము చేయబడుటకు అదొక ప్రామాణికమైన పద్ధతై యుండింది. అపొస్తలుడు వ్యాకరణ సంబంధమైన తన తొలి భాషా అలవాట్లకు వెనుదిరుగుతున్నట్టు అగుపిస్తుంది.

ఈ వచనంలోని "అపహాసకులు." రెండవ అధ్యాయంలోని అదే అబద్ధ బోధకులై యున్నారు. వారు అపొస్తలుల బోధలను, ప్రత్యేకంగా ప్రభువు తిరిగి వచ్చునను వాగ్దానమును ఎగతాళి చేసారు; మరియు వారు **తమ స్వకీయ దురాశల చొప్పున నడుచుకొన్నారు**. వారి జీవితములు దేవుని జనుల గుర్తింపు లక్షణమై యుండిన పరిశుద్ధ జీవితమునకు సూటిగా వ్యతిరేకమైనవై యుండినవి. "నిరాశా దృష్టికోణం మరియు స్వయం అతిలాలసత్వం క్రమము తప్పక కలిసిమెలసి ఉంటాయని" మిఖాయేల్ గ్రీన్ వ్యాఖ్యానించాడు.[3] దేవుడు తన అపొస్తలుల ద్వారా అనుగ్రహించిన ప్రత్యక్షతను ఏమాత్రమును గౌరవించనివారు సంబంధిత సిద్ధాంతములను మరియు నైతిక విషయాలను అతిక్రమించడానికి ఉన్ముఖులై యున్నారు.

ఆయన మరియు ఆయన పాఠకులు **అంత్య దినములలో** జీవించుచుండిరను విషయమై ఇంత కంటె ఎక్కువగా నున్న భావమును పేతురు కల్పించుకొనడం లేదు. ప్రభువు తన రాకడను యింకా వెయ్యేళ్ల పర్యంతం ఆలస్యం చేసినా, అవి అంత్యదినములే అయియుండినవి (3:8). 2 తిమోతి 3:1 మరియు హెబ్రీయులకు 1:1, 2లో ఉన్నట్టుగా, "అంత్య దినములు," రక్షకుని తొలి ఆగమనము (ఆయన రాజ్యము తొలిసారి వ్యవస్థాపింపబడుట) మరియు ఆయన రెండవ రాకడకు (తీర్పు మరియు చివరగా ఆయన పరిపాలన కార్యరూపం దాల్చుట) మధ్య నున్న మొత్తం కాలాన్ని సూచిస్తున్నాయి. పేతురు మరియు క్రొత్త నిబంధన గ్రంథకర్తలలో ఇతరులు "అంత్య దినముల" గూర్చి అర్థం చేసుకోడానికి ప్రవక్తల పలుకులను వినియోగించుకున్నారు. ప్రవక్తయైన యెషయా ఇలా వ్రాస్తున్నాడు, "అంత్య దినములలో పర్వతములపైన యెహోవా మందిర పర్వతము పర్వత శిఖరమున స్థిరపరచబడి, కొండల కంటె ఎత్తుగా ఎత్తబడును; ప్రవాహము వచ్చినట్టు సమస్త అన్యజనులు దానిలోనికి వచ్చెదరు" (యెషయా 2:2). క్రైస్తవులై యుండిన పేతురు పాఠకులు, ప్రవక్తలు చూడాలని వారు ప్రయాసపడిన ఆ రోజుల్లో జీవించారు; యెహోవా మందిర పర్వతము వ్యవస్థాపింపబడింది. అబద్ధ బోధకులు అపొస్తలుల మాటలను ఎగతాళి చేసినట్లే, ప్రవక్తయైన యెషయా సమకాలీనులు ఆయన మాటలను ఎత్తిపొడుపు పలుకులతో ఎగతాళి చేసారు (యెషయా 28:14, 15). క్రైస్తవులు "అంత్య దినములలో" జీవిస్తున్నారనే వాస్తవం వారి ప్రేషిత భారమునకు మరియు వారి పరిచర్యకు సంబంధించిన ఎదురుచూపునకు అత్యవసర పరిస్థితిని అదనంగా చేర్చుచున్నది.

**వచనము 4. "ఆయన రాకడను గూర్చిన వాగ్దానమేమాయెను?"** అంటూ అబద్ధ బోధకులు సాధికారపూర్వకమైన అల్పబుద్ధితో అడిగారనేది, మనకు ఆశ్చర్యాన్ని కలిగించాల్సిన అవసరం లేదు. వారు విశ్వాసులను అపహసించారు, విశ్వాసులు సుళువుగా మోసపోయిన మూర్ఖులై యున్నారని నిందించారు, అపొస్తలుల మాటలను అక్షరార్థంగా అవగాహన చేసుకున్నారను అపవాదు మోపారు. స్వయంవిదితమైన విషయాన్ని వారు సూచిస్తూ, **"పితరులు నిద్రించినది మొదలుకొని, సమస్తమును సృష్టి ఆరంభమున నున్నట్టే నిలిచియున్నదే"** అన్నారు. కాలములు సమయములు, రావడం మరియు పోవడం, ఒక క్రొత్త తరం ఉద్భవించడం మరియు పాత తరం చచ్చిపోవడం, అనంతమైన జీవిత ఆవర్తనమునకు ఒక సాక్ష్యమై యున్నది. అబద్ధ బోధకులు ఇలాగే వాదించారు. "ఆయన రాకడను గూర్చిన వాగ్దానము" ధైర్యం కోల్పోయిన హృదయాల కోసం కల్పింపబడిన కథయై యున్నదని వారు చెప్పుచుండిరి.

మానవ జాతి ఎంత ప్రాచీనమైందో నిరాశా దృష్టికోణం అంత ప్రాచీనమైనదై యున్నది. మాకు నియమాలు వద్దూ, నిర్బంధాలూ వద్దని చెప్పెడి వారి విషయంలో అదొక ప్రత్యేకమైన విపద్దశయై యుండింది. ఇట్టి అభిప్రాయంతో సొలొమోను చాలా ప్రయాసపడ్డాడు: "మునుపు ఉండినదే ఇక ఉండబోవునది, మునుపు జరిగినదే ఇక జరుగబోవునది. సూర్యుని క్రింద నూతనమైనదేదియు లేదు" అన్నాడు (ప్రసంగి 1:9). విశ్వాసుల మరియు అవిశ్వాసుల వైఖరి ఇచ్చటి కంటె యింకా ఎక్కువగా కొట్టవచ్చినట్లు కనబడు ఇతరమైన కొన్ని సందర్భాలున్నాయి: ఈ లోకం ఎక్కడికో వెళ్లిపోతుందని, అది దాని అంతము దిశగా కదలివెళ్లుచున్నదని విశ్వాసి నమ్ముతున్నాడు. అదృష్టం మరియు కాలానికి సంబంధించిన కారణం ఏలుతున్నాయని అవిశ్వాసి ప్రకటిస్తున్నాడు. లోకం, ఎక్కడికీ వెళ్లడంలేదు. మానవ జీవితానికి చిట్టచివరి ఉద్దేశమంటూ ఏదీ లేదు.

"చావు" (*koimaomai*) విషయంలో పేతురు ప్రయోగించిన పదం, గతించిపోవు ఆసక్తికి సంబంధించినదై యున్నది. స్తెఫెను మరణము విషయంలో ప్రయోగింపబడిన పదం ఇదే. "అతడు నిద్రించెను" అని లూకా రాస్తున్నాడు (అపొస్తలుల కార్యములు 7:60). "నిద్రించుచున్నవారు" అని ఆయన వ్రాసినప్పుడు, మృతినొందిన వారి విషయంలో పౌలు ఇదే పదమును ప్రయోగించాడు (1 థెస్సలొనీకయులకు 4:13). ఈ పదమును NASB అక్షరార్థంగా అనువదించుచున్నది, కాని అనేక బైబిలు అనువాదములు ఈ క్రియా పదమును "చచ్చిపోవుట" అని అనువదించుచున్నవి. స్పష్టంగా దీని అసలు అర్థం ఇదే. అయినప్పటికిని, "నిద్రించుట" అనే పదము చావు గూర్చి కొంచెం మృదువుగా చెప్పుకునే మాటయై యున్నది.

గ్రీకులు మరియు రోమనులు మిళితమై నివసించుచుండిన ప్రపంచంలో మరణమునకు "నిద్రించుట" అనేది ఒక సామాన్య రూపకాలంకారమై యుండినప్పటికిని, ప్రాణం విసిగిపోయిన, ఆడంబరపూర్వకమైన రోమీయుల ప్రపంచంలో మరణం ఒక వికృతరూపం గల అంశమై యుండిందనేది కూడ నిజమే. పుర్రె రూపంలో మలచబడిన చెంబులు ప్రాచీన యుగం నుంచి బ్రతికి బయటపడును. ప్రాచీన కాలం నాటి రోమీయుల సమాధుల మీద ఒక సార్థకనామముగా సర్వసామాన్యంగా "N F F N S N C," the first letters of *Non fui, fui, non sum, non curo* అనే లాటిన్ అక్షరాలుండినవి. వీటిని అనువదించినప్పుడు,

“నేను లేకుంటిని. నేనుంటిని. నేను లేను. నాకు పట్టింపు లేదు” అని అర్థమిస్తాయి.[4] పేతురు సమకాలీనులలో అనేకులకు, చావంటే అదృష్టం కొద్ది లభించిన వికృతాకారకం గల భృతియై యుండింది. క్రైస్తవులకైతే, మరణమంటే నిద్రించుటయే.

పేతురు మాటల్లో దశాబ్దాలకు సంబంధించిన ఒక లోపమును చూడాలని కొందరు ఆశిస్తారు. “పితరులు నిద్రించిరి” అని అపొస్తలుడు చెప్పడం అదొక ఊహామాత్రమైన ప్రకటన కాదని వారు వాదిస్తారు. ఆది క్రైస్తవ సమాజంలో పాతబడినవారు పితరులై యున్నారని వారు చెప్పుదురు. ఎన్నో సంవత్సరాలు గతించిపోయాయి, తర తరాలుగా మృతిచెందారు, అట్లయినను ప్రభువు తిరిగి రాలేదు. ఇట్టి ప్రక్రియలో నిరాశకలిగించడానికి ఆరంభమైన నిరీక్షణను అబద్ధ బోధకులు తమ స్వార్థానికి వినియోగించుకున్నారు. పేతురు మాటలకు ఇలాంటి అర్థవివరణ నిచ్చిన తదుపరి, పేతురు రెండవ పత్రిక అపొస్తలుడైన పేతురు హతసాక్షియైన దశాబ్దాల తరువాత రచించపబడి యుండునని వారు చెప్పుచుండిరి. అయితే ఈ వ్యాఖ్యానము సరైనది కాదని అనేక హేతువులనుబట్టి అర్థమవుతుంది.

ఈ నిరాశ ప్రారంభం కాడానికి దశాబ్దాల కాలం పట్టియుంటుందని ఇటువంటి వ్యాఖ్యానం భావిస్తుంది. “అన్నిటి అంతము సమీపమై యున్నదనేది” అపొస్తలిక సందేశమై యుండింది (1 పేతురు 4:7). “సమీపము” అనే మాటను క్రైస్తవులలో అధిక సంఖ్యాకులు ఏమని అర్థం చేసుకున్నారో చెప్పడం కష్టం. ఒక సంవత్సరం కాలంలోగా, లేదా ఐదేళ్లలోగా ప్రభువు తిరిగి వచ్చునని కొందరు ఒక అభిప్రాయాన్ని ఏర్పరచుకొని యుండవచ్చు. కాబట్టి నిరాశ ప్రారంభమవడానికి దశాబ్దాల కాలం పట్టియుండదు. నిరాశ అనేక దాని ఆరంభ దశల్లో ఎక్కువ తీవ్రంగా కలిగియుండవచ్చు. కాలం ఆరంభమైననాటి నుండి విషయాలు లేదా పరిస్థితులు లేశమైనా మారలేదని సూచించడం ద్వారా అబద్ధ బోధకులు క్రైస్తవుల ఎదురుచూపులను తమ లాభానికై వినియోగించుకున్నారు. తరాలు వస్తుంటాయి, పోతుంటాయి. కాని వారి ప్రకారంగా, “ప్రభువు తిరిగి రాలేదు.”

అబద్ధ బోధకులు జ్ఞానమునకు స్వయం నియుక్తమైన సంరక్షకులై యుండిరి. ఈ ప్రకారంగా ప్రభువు తిరిగి రావడమనేది అక్షరాలా జరుగబోదను విషయాన్ని వారు ఎరిగియుండిరి. దీనికి తోడుగా, స్వాతంత్ర్యము గూర్చి వారందించుచుండిన సందేశమును (2:19), వారు ధర్మశాస్త్రమును తిరస్కరించుటను (2:21), మరియు వారు శరీర దురాశలలో నడుచుకొనుటను (2:18) వారి జ్ఞానము సమర్థించుచుండినదని, వారు సాధికారపూర్వకంగా చెప్పుకొనుచుండిరి. తీర్పు తీర్చుటకు ప్రభువు ప్రత్యక్షమగునను విషయం క్రైస్తవ సిద్ధాంతములలో అటుతరువాత పుట్టిన ఆలోచన కాదనే విషయాన్ని అర్థం చేసికొనడంలో అబద్ధ బోధకులు విఫలులయ్యారు. మానవ చరిత్ర ఎక్కడికో వెళ్లిపోతుందని చెప్పడానికి యేసు తిరిగి వచ్చునేది సాహసోపేతమైన ఒక ఘోషణయై యున్నది. మనుష్యులు ప్రవర్తించు విధానము మరియు వారు నమ్ముతున్న విషయము ముఖ్యమై యున్నవి ఎందుకనగా దేవుడు లోకమును అది లెక్క ఒప్పజెప్పాల్సిన అంతిమ గడియల అంత్య దినము దిశగా చలింపజేస్తున్నాడు. సమస్త దేశములు ఆయన యెదుట సమావేశమవుతాయి (మత్తయి 25:31-33), ప్రతి మోకాలు వంగుతుంది (ఫిలిప్పీయులకు 2:10). అంత్య దినములు ఒక చివరి దినముతో, “ప్రభువు దినముతో” (3:10) అవి వాటి పరాకాష్టకు చేరుకుంటాయి, అప్పుడు కాలము అంతమవుతుంది. కాలానికి ఒక

ఆరంభముండిందనియు, గనుక దానికి ఒక అంతం కూడా ఉంటుందనే నమ్మకంలో నుంచి క్రైస్తవ విశ్వాసమును గూర్చిన ప్రతి ధ్రువీకరణము ఎదుగుతుందనడంలో అర్థమున్నది. "సమస్తమును సృష్టి ఆరంభమున నున్నట్టే నిలిచి యున్నదని" చెప్పడం, దాని వేళ్లు ఐహిక విచారములలోను, ఆధునిక పాశ్చాత్య సంస్కృతికి సంబంధించిన జ్ఞానసాపేక్ష వాదములోను పాతుకపోయిన అవిశ్వాసమే ఔతుంది.

**వచనము 5**. ఆరంభమనేది ఉండిందని వాదించడం ద్వారా, ఈ వాదము ముగింపబడునట్లుగా పేతురు వాదిస్తున్నాడు. ఈ రెండు పరస్పర సంబంధంగలవై ఉన్నాయి. దేవుడు కలుగజేసిన దానిని, దేవుడే అంతం చేయగలడు. యేసు సిలువవేయబడి మూడవ దినాన మృత్యుంజయుడై తిరిగి లేవడంతో అంత్య దినాలు ఆరంభమయ్యాయి. పునఃరుత్థానుడైన యేసు అంత్య తీర్పు నిమిత్తమై తిరిగి రానైయున్నాడు. ఆరంభములు మరియు అంతములు వాస్తవమైనవై యున్నవి ఎందుకనగా దేవుడు వాస్తవమైనవాడై యున్నాడు. తీర్పు నిమిత్తమై ప్రభువు తిరిగి వచ్చుటను ఒప్పుకొనని వారి గూర్చి చెప్తూ, **పూర్వము నుండి ఆకాశముండెననియు, నీళ్ల నుండియు నీళ్ల వలనను సమకూర్చబడిన భూమియు దేవుని వాక్యము వలన కలిగెననియు వారు బుద్ధిపూర్వకముగా మరతురని** పేతురు అయిష్టంతో కూడిన పెడముఖంతో వ్యక్తం చేస్తున్నాడు. సమస్తమును దేవుని ఆజ్ఞ వలన కలిగెను; గనుక అవన్నియు దేవుని ఆజ్ఞ వలననే అంతమగుననేది అసలు విషయమై యున్నది.

పేతురు సృష్టి గూర్చి రచించినప్పుడు, ఆయన ఘనమైన పాత నిబంధన ప్రవక్తల మరియు జ్ఞానుల సాంప్రదాయాన్ని పాటించాడు. మానవులు ఈ పుడమిపై వెలయునట్లు దేవతల మధ్య చెలరేగిన పురాణ సంబంధ పోరాటలను ఆయన మనముందుంచడం లేదు. ఆధునిక విజ్ఞానశాస్త్రజ్ఞులను సంతృప్తిపరచే వివరముల నివ్వడానికి ఆయన ప్రయత్నించ లేదు. ఆయన కేవలం ధ్రువీకరించాడు. ఆదికాండములో గ్రంథస్థం చేయబడిన విషయాలు మరియు వివరాలు, స్వయం విదితమైనవై యున్నవని అపొస్తలుడు విశ్వసించాడు. సమస్తము దేవుడు పలికిన ప్రకారం కలిగింది. అది విశ్వాస సంబంధమైన ఘోషణయై యుండింది. వాస్తవముల గూర్చిన సమస్త ధ్రువీకరణములు, అవి "విజ్ఞానశాస్త్ర సంబంధమైనవైనా," లేక వాటికి ఇతర ఏ పేర్లు పెట్టబడినా, అది విశ్వాస సంబంధమైన ఘోషణతో మొదలవుతుంది; కాని విశ్వాస సంబంధమైన సమస్త ఘోషణలు ఒకే వరుసక్రమంలో లేవు.

ఈ విశాల విశ్వానికి ఆరంభమనేది లేదు, పదార్థమే నిత్యమైంది, చిత్తము మరియు ప్రకృతిలో క్రమమును మరియు జీవితంలో అద్భుతాలను ఉత్పాదించడానికి అవసరమగు ఉత్పాదక శక్తి పదార్థంలో అంతర్నిహితమై యున్నదనేవి ప్రత్యామ్నాయ విశ్వాస సంబంధమైన ఘోషణలై యున్నవి. విజ్ఞాన మరియు సాంకేతికపరమైన వికాసములతో, మానవ జాతిలోనికి విడ్డూరమైన దురహంకారం పాకిపోయింది – అది ఒక ప్రక్క, అది దురహంకారమై యున్నదని దేవుడు కనునది, అది సహింపశక్యము కానిదై యున్నది, మరొక ప్రక్క, ఊహాశక్తికి గిలిగింతలు పెట్టునటువంటిదైయున్న దురహంకారమై యున్నది. క్రైస్తవులు ఒప్పుకొను విశ్వాస సంబంధమైన ఘోషణ లోకము మరియు మానవ జీవితం చూచుచున్న దానిపై ఆధారపడి యున్నది. దేవుడు తనను గూర్చి తానే సృష్టిలో ప్రత్యక్షపరచిన మరియు ఆయన వాక్యములో బయలుపరచిన దానిని అది పరిగణలోనికి తీసుకుంటుంది. పూర్వము

నుండి ఉన్న ఆకాశము మరియు భూమియు “దేవుని వాక్యము వలన కలిగెనని” ప్రభువు తిరిగి రాడని చెప్పుచుండు అబద్ధ బోధకులు మర్చిపోయారనే సంగతిని పేతురు తన పాఠకులకు జ్ఞాపకం చేయడంలో ఒక సదుద్దేశమున్నది.

ఈ విశాల విశ్వము యొక్క ఆరంభమును పేతురు, ఒక అంతమనేది ఉన్నదనుటకు నిదర్శనంగా సూచించాడనేది మనకు ఆశ్చర్యమును కలిగించనవసరము లేదు, కాని ఆయన ఎంపిక చేసికొనిన మాటలు ఆశ్చర్యాన్ని కలిగిస్తాయి. **నీళ్లలో నుండియు నీళ్ల వలనను భూమి సమకూర్చబడినదని** పేతురు ప్రకటించాడు. బహుశా మానవ జీవితం ఉనికి కలిగియుండటానికి అవసరమై యుండు నీళ్ల గూర్చి ఏమియు చెప్పడం లేదని తెలుస్తుంది, అయితే అతని మాటల్లో ఇదే అర్థమున్నదని అనుకొనవలెనను శోధన కలుగవచ్చు. విశేషంగా, ప్రధానాంశమై యుండిన తీర్పు దిశగా పేతురు మనలను నడిపిస్తున్నాడు. ఆదికాండములో గ్రంథస్థం చేయబడిన వివరము, వేరుచేయబడిన విశాలము క్రింది జలము మరియు విశాలము మీది జలముల గూర్చి రూపాకాలంకార భాషలో వర్ణిస్తుంది. ఇంకా, ఆరిన నేల అగుపించునట్లు నేలపై ఉండిన నీళ్లను ఒక చోటికి పోగుచేయడం గూర్చి కూడ అది వర్ణిస్తుంది (ఆదికాండము 1:6–10). దేవుడు నీళ్లలో వ్యవహరించిన విధానము, నీళ్లపైన ఆయనకు గల ఆధిపత్యము, సృష్టి వృత్తాంతములో ప్రధాన పాత్ర వహిస్తాయి. దేవుడు నీటిని సమాళించుట గూర్చి సుస్పష్టంగా వ్రాసినప్పటికిని, తీర్పు సమయంలోని నీళ్ల గూర్చి ఆయన ఆందోళన చెందినంతగా, సృష్టి క్రమములోని నీళ్ల గూర్చి ఆయన ఆందోళన చెందలేదు. పేతురు ఆలోచనలు అంతకంతకు అభివృద్ధి చెందుచుండగా ఆయన చెప్పదలచుకున్న విషయం అంతకంతకు స్పష్టమవుతుంది.

**వచనము 6**. పేతురు రాసిన చిన్న పత్రికలలో, జలప్రళయము గూర్చి ఆయన ముమ్మారు జ్ఞాపకం చేస్తున్నాడు (1 పేతురు 3:19–20; 2 పేతురు 2:5; 3:6). ఈ మూడు సందర్భములలోను జలప్రళయము, దేవుని తీర్పు జలప్రళయానికి పూర్వముండిన లోకమును నశింపజేసినట్లే, ఆయన తీర్పు ప్రస్తుత లోకమును అంతం చేయుననుటకు ఒక స్మృతియై యున్నది. ఈ వచనములోని ప్రారంభ పలుకులు **ఆ నీళ్లవలన (through which)** (*di'hōn*) గందరగోళంగా ఉన్నాయి ఎందుకనగా ఈ మాటలు గ్రీకు సర్వనామము బహువచనంలో ఉన్నది. **అప్పుడున్న లోకము** దేవుని వాక్యము మరియు నీళ్ల “ద్వారా,” లేక “తద్వారా,” **నశించినదని** పేతురు భావించినట్లు స్పష్టమవుతుంది. విషయం, లోకమును కేవలము ఒక జలప్రళయము నశింపజేసిందనేది కాదు, కాని ఇట్టి విధ్వంసమునకు దేవుని వాక్యము కారణభూతమై యుండింది. దేవుడే సృష్టికర్తయై యున్నాడనే విషయాన్ని ప్రభువు తిరిగి వచ్చుట జరుగని కార్యమని చెప్పినవారికి అపొస్తలుడు జ్ఞాపకం చేసాడు. గతంలో సృష్టికర్త లోకమునకు తీర్పు తీర్చాడు, గనుక దానిని నీళ్ల వలన నాశనం చేసాడు. ఔను, లోకము తన యెదుట లెక్క ఒప్పజెప్పాల్సిందేనని గతంలో పిలుపునిచ్చిన దేవుడు, అది ఆయన యెదుట మరొక పర్యాయము లెక్క ఒప్పజెప్పాల్సిందేనని దేవుడు మరొక పర్యాయము పిలుపునిస్తాడు.

**వచనము 7.** లోకము సృష్టింపబడుటలోను, నీటి వలన నాశనము చేయబడుటలోను దేవుని వాక్యము కారణభూతమై యుండిన విధంగా, **అగ్ని కొరకు నిలువచేయబడినవై, అదే వాక్యము వలన భద్రముచేయబడినవై అదే వాక్యము వలన భద్రము చేయబడియున్నవి.**

వైరుద్ధాన్ని లేదా వ్యతిరేకార్థాన్ని సూచించే సముచ్చయము అయితే (*de*)తో ఈ వచనము మొదలగుచున్నది, ఇది ఇంతవరకు చెప్పుకున్నదానికి ఒక తారతమ్యమును సృష్టిస్తుంది. NASB అనువాదము దీనిని కాని అని సరిగా అనువదించింది. ఈ తారతమ్యమనేది తీర్పు తీరునకు సంబంధించినదై యున్నంతగా, జలప్రళయానికి పూర్వపు ఆకాశము మరియు భూమికి యొక్క స్వభావమునకును ప్రస్తుతమున్న ఆకాశము మరియు భూమికిని మధ్య లేదు. దేవుడు జలప్రళయానికి పూర్వపు "ఆకాశము మరియు భూమికి" నీళ్లతో తీర్పు తీర్చాడు; అయితే ప్రస్తుత ఆకాశము మరియు భూమికి ఆయన అగ్నితో తీర్పు తీర్చును. "ఆకాశము మరియు భూమి" అని పదజాలము మానవులు జీవిస్తున్న లోకమునకు ఒక పునఃరుక్తియై యున్నది. కాబట్టి, జలప్రళయము ఆకాశమునకు తీర్పుగా ఎలా ఎంచబడవచ్చునని ప్రశ్న పొందికలేనిదై యున్నది. విషయామేమనగా, సమస్త సృష్టియు దేవుని తీర్పునకు లోనవుతుంది.

జలప్రళయము తరువాత, "నే నిప్పుడు చేసిన ప్రకారముగా, ఇకను సమస్త జీవులను సంహరింపనని" దేవుడు నోవాహునకు అభయమొసగాడు (ఆదికాండము 8:21). యూదులై ఉండి అర్థ వివరణ చెప్పుచుండిన వారు "నే నిప్పుడు చేసిన ప్రకారముగా" అనే పదజాలమును, నీటివలని సార్వజనిన తీర్పు పునరావృతము కాదని సామాన్యంగా అర్థం చేసుకున్నారు. అయితే ఇది దేవుడు సార్వత్రిక తీర్పును మరొక పర్యాయం ఎన్నటికిని పంపడని చెప్పుతున్న వాగ్దానం కాదు. జలప్రళయము గతించిన అనేక సంవత్సరముల తరువాత, ద్వితీయోపదేశకాండము ముగింపులో వ్రాయబడి యున్నట్టు మోషే గానం చేసిన గానములో, ధర్మశాస్త్రము నిచ్చినవాని నోట దేవుడు తన సొంత మాటల నుంచాడు: "నా కోపాగ్ని రగులుకొనును, పాతాళాగాధము వరకు అది దహించును, అది భూమిని దాని పంటను కాల్చును, పర్వతముల పునాదులను రవలబెట్టును" (ద్వితీయోపదేశకాండము 32:22).

దేవుడు భూమి మీదికి అగ్నితో కూడిన సార్వత్రిక తీర్పును పంపించునని రూఢిపర్చుకొనడం క్రొత్త నిబంధన కాలమునకు నడిపించిన యూదులకు అది సామాన్యమైన సంగతై యుండింది. పౌలు తన పాఠకులకు ఈ విధంగా హామీ ఇస్తున్నాడు, "ప్రభువైన యేసు తన ప్రభావమును కనుపరచు దూతలతో కూడ పరలోకము నుండి అగ్ని జ్వాలలో ప్రత్యక్షమై, దేవుని నెరుగనివారికిని మన ప్రభువైన యేసు సువార్తకు లోబడని వారికిని ప్రతిదండన చేయును" (2 థెస్సలొనీకయులకు 1:6–8). పేతురునకు కూడ, దేవుని తీర్పు దినము, ప్రభువైన యేసు అగ్నిలో ప్రత్యక్షమగు దినమై యున్నది.

అపొస్తలుడు పేర్కొనిన అర్హతను పేతురు పాఠకులు అర్థంచేసికొని యుందురు. ప్రజలందరు అగ్ని చేత తీర్పు తీర్చబడరు, దుర్మార్గులు మాత్రమే. అగ్ని చేత తీర్చబడు **తీర్పు దినము భక్తిహీనుల తీర్పును నాశనమును** జరుగు దినమై యుండును. "భక్తిహీనులలో," నిస్సందేహంగా, "ఆయన రాకడ గూర్చిన వాగ్దానమేమాయెను?" అని సాధికారపూర్వకంగా అపేక్షించుచుండిన అబద్ధ బోధకులుందురు. భక్తిహీనులు సహితము నాశనమగు అదే దినము, "దేవుని దినపు రాకడ కొరకు కనిపెట్టుచు దానిని ఆశతో అపేక్షించువారికి" (3:11–12) విడుదల మరియు రక్షణ దినమై యుంటుంది.

ఆధునిక ప్రజలు, క్రైస్తవులు మరియు క్రైస్తవేతరులు, అదే లోకాంతమనే అర్థమిచ్చు

అంతిమ న్యాయ దిన సన్నివేశముల గూర్చిన కట్టుకథలు కల్పించుకుంటున్నారు. బహుశా భూగర్భంలో దాగియున్న అగ్ని పర్వతములు పెల్లుబికివచ్చినప్పుడు సమస్త సృష్టిజాలము నశించిపోవచ్చు, లేదా యుద్ధములు చేయుచున్న దేశాలు ఒక్క అణుబాంబుతో ప్రపంచమంతటా మారణహోమము సృష్టించవచ్చు. బహుశా ఒక భారీ ఉల్క ఈ భూగ్రహంతో ఢీకొట్టి సమస్త జీవరాశిని నాశనం చేయవచ్చు. మనకు అందుబాటులో నున్న విజ్ఞానశాస్త్ర అద్భుతములనుబట్టి, అన్నింటి అంతము గూర్చి ఆధునిక జనం ఒక ఆలోచనను కల్పించుకోవాలి ఎక్కువగా కష్టపడాల్సిన అవసరం ఉండదు. అవిశ్వాసులకు సహితం, ఈ విశాల విశ్వం వారిని హడలగొట్టిస్తూ అనిశ్చయతను పెంచుతున్న చోటయ్యింది. బైబిలు ఈ క్రింది విషయాన్ని స్పష్టంగా చెప్తుతుంది: అంతము వచ్చినప్పుడు అదొక అవకాశవాద సంఘటనయై యుండదు. దేవుడు తన కుమారుని ఈ లోకమునకు మరొక పర్యాయం పంపినప్పుడు, ఆయన లోకమును తనకిష్టమైన విధంగా అంతం చేస్తాడు. తీర్పు మరియు నిత్యత్వము దీని వెనువెంట వచ్చును.

## "ప్రభువు దినము" (3:8–10)

**8ప్రియులారా, ఒక సంగతి మరచిపోకుడి. ఏమనగా ప్రభువు దృష్టికి ఒక దినము వెయ్యిసంవత్సరములవలెను, వెయ్యిసంవత్సరములు ఒక దినమువలెను ఉన్నవి. 9కొందరు ఆలస్యమని యెంచుకొనునట్లు ప్రభువు తన వాగ్దానమును గూర్చి ఆలస్యము చేయువాడు కాడు గాని యెవడును నశింపవలెనని యిచ్ఛయింపక, అందరు మారుమనస్సు పొందవలెనని కోరుచు, మీ యెడల దీర్ఘశాంతముగలవాడై యున్నాడు. 10అయితే ప్రభువు దినము దొంగవచ్చినట్లు వచ్చును. ఆ దినమున ఆకాశములు మహాధ్వనితో గతించి పోవును, పంచభూతములు మిక్కటమైన వేండ్రముతో లయమైపోవును, భూమియు దానిమీదనున్న కృత్యములును కాలిపోవును.**

"ఆయన రాకడ గూర్చిన వాగ్దానము," "భక్తిహీనుల తీర్పును నాశనమును జరుగు దినము," "ప్రభువు దినము," మరియు ఇటువంటి ఇతర పదజాలములన్నీ ఒకే సంఘటనను సూచిస్తున్నాయి. మానవాళిని ప్రభువు తీర్పులోనికి తెచ్చునో లేదోనని అపహాసకులు అనుమానం పడియుండవచ్చు, కాని దేవుడు సృష్టికర్తయై యున్నాడని పేతురు వారికి జ్ఞాపకం చేస్తున్నాడు. ఆయన సృష్టించిన సమస్తమునకు, ఆయన తీర్పు తీర్చును. దీనికి తోడుగా, గతంలో జలప్రళయమునకు మునుపటి లోకం కూడ ఇలాగే అపహసించిందని అపొస్తలుడు వారికి జ్ఞాపకం చేస్తున్నాడు. అనుమానపడుచుండిన ఆ నాటి లోకానికి దేవుని తీర్పు ఎంత కచ్చితంగా వచ్చిందో, ఈనాడు సహితం సందేహిస్తున్న లోకానికి దేవుని తీర్పు అంతే కచ్చితంగా వస్తుంది. అంతకంతకు అధికమవుతున్న ఆలస్యాన్నిబట్టి ఆశ్చర్యపడుచున్నవారి కోసం, ఇతర ఆలోచనలను పేతురు వారి ముందుంచుతున్నాడు. అపొస్తలుల చేత వాగ్దానము చేయబడింది కచ్చితంగా జరుగుతుందని తన పాఠకులకు అభయమియ్యాలనేదే ఆయన ఉద్దేశమై యుండింది. దేవుని కుడి చేతి వైపున కూర్చుండి పరిపాలించడానికి ఆరోహణమైన ప్రభువు తిరిగి వచ్చును. ఆయన వచ్చినప్పుడు, ఆయన మానవాళికి న్యాయాధిపతిగాను,

నీతిమంతుల విషయంలో న్యాయస్థాపకుడుగాను ఉండును.

**వచనము 8**. దేవుని తీర్పు ఆలస్యమైనందు వలన, ప్రవక్తలు కూడ తమ సమకాలీనుల నుంచి ఎగతాళిని ఎదుర్కొన్నారు. దేవుని తీర్పు పొంచియున్నదని ప్రకటించడంలో ఆయన ఆనందించుచుండెననియు, తన సొంత కార్యక్రమమును సాధించుట కోసం విషమును వెళ్లగ్రక్కుచుండెననియు యిర్మీయా నిందింపబడినాడు. ఆయన ప్రవచించుచుండిన సందేశం దేవుని నుంచి వచ్చినదని ప్రవక్త ఎరిగియుండెను, కాని దేవుడు చేయుచుండిన ఆలస్యం విషయంలో ఆయన కూడ కలవరపడిపోయాడు. దేవునికి మొఱపెట్టుచూ, "వారు, 'యెహోవా వాక్కు ఎక్కడనున్నది? దాని రానిమ్మని' యనుచున్నారు. నేను నిన్ను అనుసరించు కాపరినై యుండుట మానలేదు, ఘోరమైన దినమును చూడవలెనని నేను కోరలేదు" అంటూ ఆయన తన అసంతుష్టిని అభివ్యక్తం చేసాడు (యిర్మీయా 17:15, 16). యిర్మీయా, పేతురు వలెనే, ప్రభువు ఎప్పుడు తీర్పు తీర్చునో యని ముందుగానే కచ్చితంగా చెప్పలేకపోయాడు, కాని ఆయన తీర్పును గూర్చి మాత్రం, అతనికి ఎటువంటి సందేహమైనను లేకుండింది. యిర్మీయా వలె పేతురు తన అసంతుష్టిని అభివ్యక్తం చేయలేదు. విశేషంగా, ఆయన తన పాఠకులతో తర్కించాడు. తీర్పు ఆలస్యమగుట మరియు యుగము అనుకోని ఘోర విపత్తుతో అంతమగుటలో గల అర్థమేమై యుండవచ్చు? ఆయనను వ్యతిరేకించుచుండినవారు చెప్పుచుండినట్లే, "ప్రభువు దినము" యిక రాదేమో అనేది దానర్థమా? "ఆలస్యము" అనేది సంబంధవాచక పదమై యున్నదని పేతురు వారికి సూచించాడు. "ఆలస్యం" అనే పదమునకు, గుండెచప్పుడు ప్రకారం కాలమును పరిగణించు మనుష్యుల చేత చెప్పుకొనబడు అర్థాన్ని, అదే కాలమును దేవుడు పరిగణించు ప్రకారం అర్థమయ్యే "ఆలస్యం"తో పరిగణించినప్పుడు ఉండే సంబంధం, పట్టించుకొనదగినది కానిదై యుంటుంది. గనుక అపొస్తలుడు, **ప్రియులారా, ఒక సంగతి మరచిపోకుడి** అనే మాటలతో తన విరోధులను ఎదుర్కొంటున్నాడు. దాని పైరాతను బట్టి, మోషే చేత రాయబడిందని అర్థమయ్యే ఒకే ఒక్క కీర్తనలో నుంచి అపొస్తలుడు ఒక వాక్యభాగమును జ్ఞాపకం చేస్తున్నాడు. "నీ దృష్టికి వేయి సంవత్సరములు గతించిన నిన్నటివలె నున్నవి, రాత్రియందలి యొక జాముదలె నున్నవి" (కీర్తనలు 90:4). ఈ ఆలోచనను ఆధారంచేసుకొని, పేతురు, **ప్రభువు దృష్టికి ఒక దినము వెయ్యి సంవత్సరముల వలెను, వెయ్యి సంవత్సరములు ఒక దినము వలెను ఉన్నవి** అని ధ్రువీకరిస్తున్నాడు.

ఇశ్రాయేలీయుల గొప్ప దేవుడు తరతరాలను అధిగమించినవాడై యున్నాడు. ఆయన అబ్రాహాము దేవుడు, ఇస్సాకు దేవుడు, మోషే దేవుడు, సమూయేలు, దావీదు, యెషయా, మరియు నజరేతువాడైన యేసు దేవుడై యున్నాడు. "వారు కాలమును సంవత్సరముల చొప్పున లెక్కించరు" అంటూ పరలోకము గూర్చి గానం చేసే ఒక క్రైస్తవ సంగీతమున్నది.[5] దేవుడు తన రెండవ రాకడను చాలా చాలా ఆలస్యం చేసాడన్నట్టు అగుపించవచ్చునని పేతురు చెప్పుచున్నాడు, కాని కాలమును మర్త్యులైనవారు లెక్కించునట్లుగా దేవుడు లెక్కించడనే విషయాన్ని మనుష్యులు అర్థంచేసుకోవాలి. ఆయన దృష్టిలో ఒక వెయ్యి సంవత్సరములు, ఒక లక్ష సంవత్సరములు, ఒక దినము లేదా ఒక గంటను మించినవి కావు. మానవాళి కట్టుబడియున్న కాలమును గూర్చిన బుద్బుదప్రాయమైన భావమును దేవునిపై రుద్దడానికి ప్రయత్నించడం దేవుని సృష్టిజాలమునకు యుక్తము కాదు.

ప్రభువు దృష్టికి ఒక దినము వెయ్యి సంవత్సరముల వలె నున్నదనే విషయాన్ని పేతురు కేవలము సానుకూలంగా నున్న ప్రస్తావనగా పోల్చాడు. ఒక లక్ష సంవత్సరములు లేదా పది లక్షల సంవత్సరములు దేవుని దృష్టిలో ఒక దినము వలె నున్నదని ఆయన మామూలుగా చెప్పవలసి యుండింది. అలా అయినప్పటికీ, యెరూషలేము పట్టణములో నుంచి క్రైస్తవులు క్రీస్తుతో కూడ వెయ్యి సంవత్సరముల కాలము ఏలుదురనే భావాన్ని ఈ వచనము స్థిరపర్చుచున్నదని ఆది క్రైస్తవ శతాబ్దముల కాలములో ఎంచబడింది. కొందరు, రెండవ శతాబ్దము ముగింపులో జీవించిన ఐరేనియస్ వంటివారు, సృష్టి క్రమములోని ప్రతి దినమునకు వెయ్యి చొప్పున, లోకము ఏడు వేల సంవత్సరములు తాళుకుంటుందనే వాగ్దానము ఈ వాక్యభాగములో కలదని గమనించారు.[6] గతించిన వెయ్యి సంవత్సరములు, ప్రభువు తన పరిశుద్ధులతో కూడ ఇహమును పరిపాలించుచుండిన కాలమైయుండింది. క్రీస్తు ఈ భూమి మీద ఒక వెయ్యి సంవత్సరాల కాలం పరిపాలిస్తాడు అనే మత సిద్ధాంతము, chiliasm అని పిలువబడే సిద్ధాంతము, చేయబడిన మార్పులతో, దశాబ్దాలుగా అందజేయబడుతూ వచ్చుచున్నది. అది, సృష్టి తేదీ క్రీ.పూ. 4004 అని చెప్పిన, ఇది ఇటీవలి కాలం వరకు కూడ బైబిలు మార్జిన్‌లలో ముద్రితమైనది, బిషప్ Ussher ను ప్రభావితం చేసింది. ఆధునిక వెయ్యేళ్ల పరిపాలనకు ముందటి కాలము మరియు దైవయుగ సంబంధ విధానమును అది ప్రభావితం చేసింది. తరువాతి కాలంలో వెలసిన విశ్వాసులు ఉజ్జాయింపుగా అభిప్రాయాన్ని ఏర్పరచుకొను విధానమునకు పేతురు తనను తాను అప్పగించుకొనలేదు. ప్రభువు, ఆయన కిష్టమైన సమయంలో, తిరిగి వచ్చునని చెప్పడంతో ఆయన సంతృప్తిచెందాడు. ఆయన రాకడ వెనువెంట తీర్పు మరియు నిత్యత్వము చోటుచేసుకుంటాయి.

**వచనము 9**. ఆలస్యమైన ప్రభువు రాకడను అబద్ధ బోధకులు ఆయన యిక రానేరాడని చెప్పడానికి నిదర్శనముగా ఎంచారు. ఈ ఆలస్యాన్ని వివరించడానికి అపొస్తలుడు మరొక సహేతుకమును తెలియజెప్పుతున్నాడు. దేవుడు **మీ యెడల దీర్ఘశాంతముగలవాడై యున్నాడు**. ఆలస్యమగుచుండిన ప్రభువు తీర్పు యూదులు తరచుగా ఆందోళన చెందుచుండిన అంశమై యుండిందని క్రొత్త నిబంధనకు దగ్గరగా నుండిన ముందటి మరియు తరువాతి కాలము నుంచి అవశిష్టంగా శేషించిన కార్యములు సూచిస్తున్నాయి. విశ్వాసులైనవారు న్యాయస్థాపనను ఆశించుచుండిరి. అయితే ప్రభువు ఎందుకు ఆలస్యం చేసినట్టు? సమాధానంగా, **కొందరు ఆలస్యమని యెంచుకొనునట్లు ప్రభువు తన వాగ్దానమును గూర్చి ఆలస్యము చేయువాడు కాడని** పేతురు సాహసంతో చెప్పుతున్నాడు. దేవుడు తన సంకల్పములను నెరవేర్చుతున్నాడు. ఆయన "మనుష్యులందరు రక్షణ పొంది, సత్యమును గూర్చిన అనుభవజ్ఞానముగలవారై యుండవలెనని యిచ్ఛయించుచున్నాడు" (1 తిమోతి 2:4). ఈ హేతువునుబట్టి, ఆయన తీర్పును ఆలస్యం చేస్తున్నాడు. అజ్ఞానులు మరియు తిరుగుబాటుదారులు సహితం యేసు సాక్ష్యమును విని, విశ్వసించి, మారుమనస్సు నొంది, ఆయనకు విధేయులు కావలెనని దేవుడు వారికి అవకాశమిస్తున్నాడు. "తీర్పు వాయిదావేయబడుచు, మారుమనస్సు నొందడానికి చివరి అవకాశము సహితం అనుమతింపబడుచుండగా, దేవుని దీర్ఘశాంతము ఒక అంతరమును, ఒక విరామ కాలమును సృష్టిస్తుంది."[7]

ఆయన మరణమునకు మునుపు, ఆయన రాకడ గూర్చి యేసు తానే సెలవిచ్చాడు, కాని కచ్చితమైన దినముగాని గడియగాని ఒకడు ఊహించుకొనాల్సిన విషయం కాదంటూ

ఆయన హెచ్చరించాడు. ఈ విషయాన్ని ఉద్ఘాటించడానికి, యేసు, "అయితే ఆ దినమును గూర్చియు ఆ గడియను గూర్చియు తండ్రి మాత్రమే యెరుగును, గాని యే మనుష్యుడైనను పరలోకమందలి దూతలైన కుమారుడైనను, ఎరుగరని" చెప్పాడు (మత్తయి 24:36). అంత్య కాలమును వారు ఏ విధంగా అర్థంచేసికొనవచ్చునో యను విషయాన్ని ఆయన తన శిష్యులకు నేర్పించడానికి యేసు తగు జాగ్రత్త వహించాడు. మత్తయి 24 మరియు 25 అధ్యాయాలు ముగింపుకు వస్తున్నాయనగా, ఆయన రాకడ మరియు దానితో కూడ కలిసియుండు తీర్పునకు సంబంధించిన అనేక ఉపమానములను యేసు వర్ణించాడు. ఒకడు అనుకొనని గడియలో ఆయన ఆకస్మికంగా వస్తాడు. మనుష్యులు తమ దైనందిన కార్యకలాపములలో నిమగ్నమై యుంటారు: పెండ్లి చేసికొనుచు, పొలములో పనిచేయుచు, తిరుగలి విసరుచు నుందురు (మత్తయి 24:37–41).

యేసు రెండవ మరియు మానవాళి తీర్పు జరిగినప్పుడు కొందరు ఆశ్చర్యపడుదురు ఎందుకనగా ఆయన రాకడ ఆలస్యమవుతుందని వారనుకొనుచుండిరి. వారు ఒక యజమానుడు తన ఆస్తి యొక్క సంరక్షణ బాధ్యతను అప్పజెప్పిన గృహనిర్వాహకుని వలె ఉంటారు. యజమానుడు చాలా కాలం గడిచేంత వరకు తిరిగి రాడని ఈ గృహనిర్వాహకుడు అనుకున్నాడు; వాడు తన తోటి దాసులను దూషించాడు, తన యజమానుడు వస్తుసామగ్రిలో నుంచి చిల్లర చౌర్యం చేసాడు. ఇంతలో వాడనుకున్న దాని కంటె ఎంతో ముందుగానే, ఆకస్మికంగా యజమానుడు వచ్చి వాని ముందర దర్శనమిచ్చాడు. ఈ గృహనిర్వాహకుడు "వేషధారులతో కూడ పాలు నియమింపబడినవాడయ్యాడు" (మత్తయి 24:51).

ఇతరుల ఎదురుచూపులు మరొక విధంగా ఉంటాయి. వారు ఆయన చేసే ఆలస్యాన్ని లెక్కించకుండా, ఆయన రాకడ గూర్చిన కాలమును లెక్కలు వేస్తుంటారు. అలాంటప్పుడు, ఆయన వారి కాలపట్టిక ప్రకారం రానట్లయితే, వారి విశ్వాసం బలహీనపడుతుంది. వారు తిరిగి ప్రాపంచిక పనుల్లో నిమగ్నమైపోతారు. ఆయన తన హెచ్చరికను స్పష్టం చేయడానికి, యేసు పెండ్లి కుమారుని రాక కోసం వేచి యుండిన పది మంది కన్యకల గూర్చిన ఉపమానము వారికి చెప్పాడు. పెండ్లి కుమారుని రాకడ వారనుకున్నదాని కంటె ఎక్కువ ఆలస్యమయ్యింది, గనుక వారి విశ్వాసం సన్నగిలి పోయింది (మత్తయి 25:1–13). కొందరి విషయములోనైతే, ప్రభువు, వారనుకునే దాని కంటే ముందుగానే వస్తాడు; ఇతరుల విషయములోనైతే, వారనుకున్న సమయం దాటిపోయిన తరువాత వస్తాడు. ఆయన ఎప్పుడు ప్రత్యక్షమైనా, ఆయన అనుచరులు ఎల్లవేళలందు సిద్ధంగా ఉండవలెనని ఆయన కోరుతున్నాడు. రాకడ సమయాన్ని ఊహించుకొనడం మానివేయాలని ఆయన ప్రోత్సాహించాడు.

ప్రభువు రాకడ సమయము గూర్చి క్రొత్త నిబంధనలో ఎచ్చోటనైనను శిష్యులు ఉజ్జాయింపుగానైనా ఊహించుకొనలేదు. రాకడ సంఘటన ఏ సమయంలోనైనా సంభవింపవచ్చునను ఎదురుచుపుతో, జీవితం జీవింపబడుతుంది. ఆయన రాకడ అనుకున్న సమయాని కంటె ముందుగా జరిగినా లేదా ఆలస్యమైనా, విశ్వాసులు అందుకు సిద్ధపడినవారై జీవించుచుండవలెను. అట్లయినను, ఊహాకల్పనలు ఆపుజేయబడలేనివిగా ఉంటున్నాయి. ప్రాచీన మరియు ఆధునిక క్రైస్తవ వర్గములు దానియేలు, యెహెజ్కేలు, లేదా ప్రకటన గ్రంథంలోని దర్శనాలతో ఉత్సాహపూర్వకంగా సంబంధం కలిగియుండి. వాటిని

అధ్యయనం చేయడంలో ఎన్నడు అలసిపోలేదు. విధివిధానములు విప్పబడుతున్నాయి, కాలపట్టికలు లెక్కలువేయబడుతున్నాయి, ఏదో ఒక నిర్దిష్టమైన దినాన ప్రభువు తిరిగి రానే వస్తాడనే విషయం లోకానికి తెలియజేయబడుతుంది. తెల్లని వస్త్రములు ధరించిన ప్రజలు ఇళ్ల పైకప్పులపై కూడుకున్నారు, ఆకాశం వైపు కన్నులెత్తి తేరిచూసారు. దినములు వస్తున్నాయి, పోతున్నాయి, ప్రభువు తన సంకల్పములను తాను అనుసరిస్తూనే ఉన్నాడు.

ప్రభువు తిరిగి కచ్చితంగా వచ్చునని పేతురు సెలవిస్తున్నాడు. క్రైస్తవులు, ఎదురుచూపుతో జీవించాలి. పరిస్థితులు నిలకడగా లేవు, మారుచుండు ఈ పరిస్థితుల ఎరుక దేవునికి మాత్రమే కలదు. ఆయన తన సమస్త సృష్టిజాలము పట్ల కలిగియున్న ఉపకారబుద్ధి గల సౌహార్దము చేత నడిపింపబడుతున్నాడు. ఆయన **యెవడును నశింపవలెనని యిచ్ఛయింపక, అందరు మారుమనస్సు పొందవలెనని కోరుతున్నాడు**. ఏదిఏమైనా, ఆయన పరిశుద్ధత నిజమని నిరూపింపబడుతుందనే విషయాన్ని పట్టించుకొనకుండా ఉండకూడదు. ఆయన సహనము సంపూర్తిగా ఖాళీ అయినప్పుడు, మానవాళి పాపములు పూర్తి అయినప్పుడు, ప్రభువు తీర్పు తీరుస్తాడు. "ఎందుకనగా తాను జరిగించిన క్రియల చొప్పున, అవి మంచివైనను సరే చెడ్డవైనను సరే, దేహముతో జరిగించిన వాటి ఫలమును ప్రతివాడును పొందునట్లు. మనమందరమును క్రీస్తు న్యాయపీఠము ఎదుట ప్రత్యక్షము కావలయును" (2 కొరింథీయులకు 5:10)

**వచనము 10**. వ్యతిరేకార్థాన్ని సూచించే పదసముచ్ఛయము **అయితే** అనేది, "వచ్చును" (*hēxei*) అని అనువదింపబడిన గ్రీకు క్రియాపదము యొక్క ఉద్ఘాటింపుగల స్థానముతో కూడ, సంశయవాదులకు మరియు అనుమానపడువారికి పొరపాటుపడజాలని ఒక హెచ్చరికను ఇచ్చుచున్నది. పేతురు సందేశం సామాన్యమైనదై యున్నది: పొరపాటుపడవద్దు, **ప్రభువు దినము వచ్చును**. ఆయన యింకా వెయ్యేళ్లు ఆలస్యం చేసినా లేక ఈ రోజు గడువక మునుపే వచ్చినా, తీర్పు మాత్రం నిశ్చయం. "ప్రభువు దినము" పాత నిబంధనలో దాని వేరులు లోతుగా పాతుకపోయిన ఒక భావనయై యున్నది. ప్రవక్తలకైతే, అది దేవుడు శక్తిమంతముగా చర్య చేపట్టు దినమై యుండింది, అది ఇశ్రాయేలు ప్రజలను విడిపించుట కావచ్చు లేదా దేశాన్ని శిక్షించుట కావచ్చు.

దేవుడు ఏర్పరచుకొనిన ప్రజలకు హాని కలిగించినవారికి, లేదా ఆయనకు దురహంకారంతో లోబడనివారికి, "ప్రభువు దినము" భయము, నిరాశతో కూడిన నిరుత్సాహము, మరియు అంధకారమయమైనదిగా ఉంటుంది. అప్పటి వరకు అణచుకొనబడుచుండిన దేవుని ఆగ్రహము బహిరంగంగా ప్రదర్శింపబడుతుంది. "యెహోవా దినము వచ్చుచున్నది, ఘోషించుడి! అది ప్రళయమువలె సర్వశక్తుడగు దేవుని యొద్దనుండి వచ్చును" (యెషయా 13:6; జెఫన్యా 1:14–16 చూడుము). ఆమోసు కూడ "ప్రభువు దినము" దేవుడు తన ఉగ్రతను ఇశ్రాయేలీయుల శత్రువుల మీద ప్రదర్శించు సమయమై యుంటుందనే ప్రజాదరణ పొందిన భావమును ఎదుర్కొన్నాడు. అదొక విడుదల దినమై యుంటుంది. నిజానికి, "దేవుడు మీ విషయంలో ఆగ్రహము చెందియున్నాడు, నీ చుట్టూర నున్న విగ్రహారాధికులైన జనుల విషయములో కాదు" అని, ప్రవక్త ప్రవచించాడు. "అయ్యో, యెహోవా దినము రావలెనని ఆశపెట్టుకొనియున్న వారలారా, మీకు శ్రమ; యెహోవా దినము వచ్చుటవలన మీకు ప్రయోజనమేమీ? అది వెలుగుకాదు, అంధకారము"

అని ఆయన పలికాడు (ఆమోసు 5:18).

పాత నిబంధనలో కంటే, క్రొత్త నిబంధనలోనే, ఎక్కువ నిర్మాణాత్మకమైన ఆలోచనలు "ప్రభువు దినము"తో సంబంధంగలవై యుండటానికి ఉన్ముఖమై యున్నవి. రూఢిపర్చుకోడానికి, అట్లయినను అది ఉగ్రత మరియు తీర్పు దినమై యున్నది; కాని అది దేవుని ప్రజల పక్షమున న్యాయస్థాపన చేయబడునటువంటి దినము కూడ అయియున్నది, అప్పుడు వారు ప్రభువు సన్నిధిలో సమాధానము మరియు విశ్రాంతిగలవారై యుందురు. అన్నిటిని మించి, "ప్రభువు దినము," ఆయన తిరిగి ఒక న్యాయాధిపతిగా వచ్చినప్పుడు, యేసు క్రీస్తు ఆకాశమండలములో ప్రత్యక్షమగు సమయము వంటిదై యుంటుంది.

లూకా 17:22–37లో యెరూషలేముపై తీర్చబడు తీర్పు మరియు లోకముపై తీర్చబడు అంత్య తీర్పు మిళితం చేయబడుట గందరగోళమును సృష్టిస్తుంది, కాని "దినము" గూర్చిన భావన వాక్య భాగమందంతటను విస్తరించి యున్నది: "ఆలాగున మనుష్యకుమారుడు తన దినమున ఉండును" (17:24), "మనుష్యకుమారుని దినములు" (17:26), "ఆ దినమున" (17:31). పౌలు, "ఆర్భాటముతోను, ప్రధాన దూత శబ్దముతోను, దేవుని బూరతోను పరలోకము నుండి ప్రభువు దిగివచ్చును" అని రాసాడు (1 థెస్సలొనీకయులకు 4:16). పేతురు దృష్టికోణం ప్రకారం, "ప్రభువు దినము" ఇహలోక కాలము అంతమునకు ముద్రవేయు ఒక సంఘటనయై యుండింది. ఆ దినమున, యేసు మానవ జాతి తరాలన్నిటికి తీర్పు తీర్చును. భూమి, కనీసం అది ప్రస్తుతమున్న రూపంలో, దానికి ఉనికి కలిగియుండదు. **ఆ దినమున ఆకాశములు మహా ధ్వనితో గతించి పోవును, పంచభూతములు మిక్కటమైన వేండ్రముతో లయమైపోవును.**

యేసు, ప్రభువుగాను మరియు న్యాయాధిపతిగాను ప్రత్యక్షమగుట ఆకస్మికంగా జరుగుతుంది. నిర్దిష్టమైన ఆ దినము గూర్చియైనను ఆ గడియ గూర్చియైనను ఎటువంటి ముందు హెచ్చరికలు ఉండవు. ఆయన ఒక దొంగ వలె తిరిగి వచ్చునని యేసు తన శిష్యులకు తెలియజెప్పాడు (మత్తయి 24:43). ఈ అలంకారిక దృష్టాంతమును పౌలు 1 థెస్సలొనీకయులకు 5:2లో ఉపయోగించుకున్నాడు. ప్రకటన గ్రంథంలో, "దొంగ" గూర్చిన రూపకాలంకారము కొనసాగుచునే యున్నది (ప్రకటన 3:3; 16:15–16). పేతురు ప్రకారం కూడ, ప్రభువు **దొంగవచ్చినట్లు వచ్చును**. దొంగతనము కొరకు వాడు రావాలనుకునే సమయం గూర్చి ముందుగా తెలియజెప్పని దొంగ వలె, యేసు ఏ ముందు హెచ్చరికనైనను చేయడు. ప్రతి నిత్యమూ కనిపెట్టుకొని ఎల్ల వేళలందు సిద్ధంగా ఉండుట యే, దొంగ చేయు దోపిడీ నుంచి కాపాడుకొనగల మార్గమై యున్నది. ఆయన తిరిగి రాడానికి ప్రభువు ఏ క్షణాన్ని ఎంపిక చేసికొని వచ్చినా, ఆయన వారిని కొనిపోవునట్లు దేవుని ప్రజలు సిద్ధంగా ఉన్నవారుగా జీవించవలసినవారై యున్నారు. క్రొత్త నిబంధన యందంతటను, ప్రభువు తిరిగి వచ్చు సమయము లేదా ఆయన రాకడ కచ్చితంగా కలిగియుండు లక్షణాల గూర్చి మితిమీరిన ఊహాగానాలు లేవు. అంత్యదిన సిద్ధాంతము క్రొత్త నిబంధనలో నీతి విషయమై ప్రయోజనకరంగా ఉంటున్నది. ప్రభువు తిరిగి వచ్చునని ఎరిగియుండుట వలన, ఒకడు దాని గూర్చి హెచ్చరింపబడినవాడుగాను భక్తిపూర్వకంగా జీవించడానికి ప్రేరేపింపబడినవాడుగాను ఉండును.

10వ వచనంలోని చివరి భాగం క్రొత్త నిబంధనలో అత్యంత కష్టతరమైన మూల

గ్రంథ పాఠ్య సంబంధమైన వ్యత్యాసములను నివేదించుచున్నది. కొన్ని ప్రాచీన ప్రతుల్లో, **భూమియు దాని మీద నున్న కృత్యములును కాలిపోవును** (*katakaēsetai*) అని వ్రాయబడి యున్నది. ఇతర ప్రతులలో, అది అక్షరార్థంగా అనువదింపబడినప్పుడు, "భూమి మరియు దాని పనులు కనుగొనబడును" (*heurethēsetai*) అనే అనువాదము తయారవుతుంది. మూల గ్రంథ పాఠ్య నిదర్శనము సమానంగా విభజింపబడి యున్నది. NASB మరియు KJV "కాలిపోవును" అనే వాచనమును అనుసరిస్తున్నాయి. రక్షింపబడినవారిలో అనేకులు, భవిష్యత్తులోని ఏదో ఒక సమయంలో, పునఃరుద్ధరింపబడిన పుడమిపై జీవిస్తారనే బోధకు మద్దతిచ్చునట్లు, The New World Translationలో "కనుగొనబడును" అని అనువదింపబడి యున్నది.

మనము "కాలిపోవును" అని చదువుకున్నా లేదా "కనుగొనబడును" అని చదువుకున్నా, పేతురు దానిని ప్రయోగిస్తున్న విధంగా ఈ పదము యొక్క ప్రత్యేకమైన సూక్ష్మభేదమును గ్రహించడానికి అవసరమయ్యే సహాయం కోసం పాఠకుడు సందర్భమును దృష్టిలో ఉంచుకొనవలెను. ఇట్టి సందర్భంలో, ఆకాశములు గతించిపోవునవై యున్నవి, పంచభూతములు మిక్కటమైన వేండ్రముతో కరిగిపోవునవై యున్నవి అనే వాచనమును మనము "కనుగొనబడును" అని పరిగణించినట్లయితే, ఈ పదము మనకు తెలియజెప్పు అవగాహన సందర్భమును బట్టి నిర్ధరింపబడవలెను. ఈ ప్రకారంగా NIV, సందర్భమును ఆధారం చేసుకొని దీనిని "భూమియు దానిలోని సమస్తమును బట్టబయలు చేయబడును" అని అనువదించుతున్నది. "కనుగొనబడును" అనే మాట సరైన వాచనమైనట్లయితే, నిస్సందేహంగా పేతురు "కనుగొనబడిన," "బట్టబయలు చేయబడిన," లేదా "కప్పబడకుండా ఉంచబడిన" అనే అవగాహనను భావించియుంటాడు. అపొస్తలుని అర్థమేమిటో స్పష్టంగా తెలియుచున్నది. ప్రభువు తిరిగి వచ్చినప్పుడు భూమియు దానిలోని సమస్తమును నాశనము చేయబడును.

## ప్రభువు దినము దృష్ట్యా పరిశుద్ధంగా జీవించుట (3:11-13)

**11-12ఇవన్నియు ఇట్లు లయమైపోవునవి గనుక, ఆకాశములు రవులుకొని లయమైపోవునట్టియు, పంచభూతములు మహావేండ్రముతో కరిగిపోవునట్టియు, దేవుని దినపు రాకడకొరకు కనిపెట్టుచు, దానిని ఆశతో అపేక్షించుచు, మీరు పరిశుద్ధమైన ప్రవర్తనతోను భక్తితోను ఎంతో జాగ్రత్తగలవారై యుండవలెను. 13అయినను మనమాయన వాగ్దానమునుబట్టి క్రొత్త ఆకాశములకొరకును క్రొత్త భూమికొరకును కనిపెట్టుచున్నాము; వాటియందు నీతి నివసించును.**

ప్రభువు రాకడ గూర్చి, పేతురు ఏదో ఒక నిరర్థకమైన జిజ్ఞాసను తృప్తిపరచడానికి దానిని వర్ణించలేదు. ప్రభువు రాకడ గూర్చిన ఊహాగానాలు ఉత్తుత్తివే. కాలము మరియు పరిస్థితులకు కట్టుబడి యుంటున్నందు వలన, ప్రభువు రాకడ మరియు దానితో కూడ వచ్చు తీర్పు గూర్చి దేవుడు గ్రహించు సమస్తమును క్రైస్తవులు గ్రహించలేరు. ఆయన ఎలా లేదా ఎప్పుడు చేస్తాడు అనేది కాదు, కాని ఆయన ఏంచేస్తాడో అనే విషయం ఆయన ప్రజలకు

తెలిస్తే, అది చాలు. దేవుడు ఆ లోకము యొక్క అంతాన్ని ఎలా సంభవింపజేయబోతున్నాడనే విషయం గూర్చి ఊహించడానికి బదులుగా, సంబంధిత అంతర్భావములపై సావధానమును కేంద్రీకరించవలెనను పిలుపుతో పేతురు సంతృప్తిచెందాడు. ఈ లోకము దేవుని తీర్పు తీర్చు శక్తిమంతమైన హస్తము క్రింద ఉన్నట్లయితే, యేసు తిరిగి వచ్చి, మానవాళికి తీర్పు తీ ర్చి భూమిని నాశనం చేయనైయున్నట్లయితే, క్రైస్తవులు సంభవింబోవు సంఘటనల దృష్ట్యా తగు విధంగా జీవించవలసినవారై యున్నారు. ప్రభువు రాకడ దృష్ట్యా జీవించినప్పుడు, జీవితం భిన్నంగా ఉంటుంది. విశ్వాసులు ఆయన రాకడ కొరకు ఆసక్తితో కనిపెట్టుకొని యున్నప్పుడు, వారు పరిశుద్ధమైన మరియు మంచి జీవితములు జీవిస్తారు. తరువాతి వచనాల్లో పేతురు వర్ణిస్తున్న విషయం ఇదే.

**వచనము 11.** అపొస్తలుడు అలంకారయుక్తంగా అడుగుతున్న విషయం, **మీరు ఎంతో జాగ్రత్తగలవారై యుండవలెను అనేది, ఇవన్నియు ఇట్లు లయమైపోవునవి గనుక** అనే తుది అభిప్రాయం ఆధారంగా చెప్పబడుతున్నది. సవాలు, వారు క్రైస్తవులైనా కాకపోయినా, సమస్త జనులకు సముచితమైనదై యుండింది. ఈ పుడమిపై ఆకర్షణీయంగా మెరిసేదంతా తాత్కలికమైనదే అని అర్థంచేసుకోడానికి ఒకడు మేధావియై యుండనవసరం లేదు. ఒకడు సిరిసంపదలు ఎంత సంపాదించినా లేదా ఎంత కూడబెట్టుకున్నా, చివరకు కొంచుబోయేదేమీ ఉండదు, దానంతటిని ఇక్కడే వదిలిపెట్టాల్సిందే. ఒకడు నిర్మించుకునేదంతా పాడై చివరకు శిథిలమైపోతుంది. మనము దేవుని యందు విశ్వసించకపోయినా కూడ, ఈ లోకానికి అంతమే లేదన్నట్టుగా ఒకడు తన జీవితాన్ని క్రమపర్చుకొనడం, అది మూర్ఖత్వమే ఔతుంది. అవిశ్వాసికి, మానవ జీవితమనేది దుఃఖమే, నిరీక్షణయే లేని విశ్వాసమే మిగిలియున్న అగ్ని భూతము లేక కలపలో ఉండే పురుగు యొక్క జీవితం కంటె ఎక్కువైనదేమీ కాదనట్టు అగుపిస్తుంది. ఒకడు వాడు ఆనందంగా అనుభవించగల ఐహిక/ఇంద్రియ సుఖభోగాలన్నిటిని అనుభవించి ఆ మీదట మరణించడానికి జీవిస్తుంటాడు. దీనికి తారతమ్యంగా, మానవులు దేవుని పోలిక చొప్పున సృజింపబడి యున్నారనేది బైబిలు యొక్క సుస్థిరమైన సందేశమై యున్నది, మరియు వారు అలా చేయబడి యున్నందునుబట్టి, వారు దేవునికి లెక్క ఒప్పజెప్పవలసిన బాధ్యతగలవారై యున్నారు. ఈ విశాల విశ్వం దేవుని సృష్టియై యున్నట్లయితే, దాని గమ్యమును నిర్ధరించేవాడు, నిర్ధరించగలవాడు కూడ ఆయనే.

యుగాంతరము గూర్చి దేవుడు బయలుపరచిన ప్రత్యక్షత నిరర్థకమైన జిజ్ఞాసను తృప్తిపరచడానికి కాదు; కాని భక్తిపూర్వకమైన జీవితాన్ని ప్రేరేపించడానికే ఉద్దేశింపబడినదై యున్నది. దేవుని వాస్తవమును అంగీకరించినప్పుడు, ఆయన తనను తాను బైబిలులో ప్రత్యక్షపరచుకున్నాడని విశ్వసించినప్పుడు, మానవుని ప్రవర్తన దేవుని స్వభావమును ప్రతిబింబింపజేయాల్సి వుంటుందని వేరుగా చెప్పనవసరం లేదు. దాని అంతరాంతరాలలో, రెండే రెండు నీతి నియమములకు సంబంధించిన పద్ధతులు మన సావధానాన్ని ఆకర్షించుటకు అర్హమైనవై ఉండగలవు. మొదటిది, మానవులు మనస్సే లేని, ఉద్దేశమే లేని, మరియు దిశా నిర్దేశనమే లేని ఈ విశాల విశ్వంలో కేవలము ఒక కాకతాళీయమైన సంఘటనయై యున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో, నీతి నియమ నిబంధనల విధానం క్రూరాతి క్రూరమైన కోరలు కలిగినదై దాని పంజాను విసరు పద్ధతిగా మారుతుంది. ఎవడు ఎంత పెద్ద గద కర్రను కలిగియుంటే, వానిదే పైచేయి అవుతుంది.

అర్థవంతమైనదై యుండు ఇతరమైన ఒకే ఒక్క నీతి నియమ నిబంధనల పద్ధతి, దేవుని అస్థిత్వములో పునాదిగలదై యుంటుంది. విశాల విశ్వ నిర్మాణంలోనికి నిర్మింపబడినదైయున్న అత్యావశ్యకమైన "న్యాయము" దేవునిని బట్టియే ఉన్నదని అది బిగ్గరగా ఘోషిస్తుంది. జీవిత గమనాన్ని నిర్దేశించడానికి వాటికవి సముచితమైనవై యుండు సూత్రములున్నవి. "దేవుని కృప మరియు మంచితనము యెడల ప్రజలు ప్రదర్శించు ప్రతిస్పందన" నీతి శాస్త్రమై యున్నది.[8] రాబర్ట్ డేవిడ్సన్ యుక్తంగా ఇలా చెప్పుతున్నాడు:

> దేవుని గూర్చి మనము ఎరిగియున్న దాని వలన మానవులమైన మన నుంచి కొంత విధేయత, ఒక నిశ్చయమైన ఒక జీవిత విధానము కోరబడుతున్నదనేది గమనార్హమైన ముఖ్య విషయమై యున్నది. అనగా, నీతి ప్రమాణం బయలుపరచబడిన దేవుని స్వభావముతో సన్నిహిత సంబంధం కలిగియుండునట్లు తేబడుతుందని మరొక మాటలో చెప్పుకొనవచ్చు.[9]

**పరిశుద్ధమైన ప్రవర్తన మరియు భక్తి** క్రైస్తవ జీవితము యొక్క స్థిరమైన ఆశయమై యున్నది. "ప్రవర్తన" (*anastrophē*) అని అనువదింపబడిన పదము స్వయం చేతనత్వంతో ఎంపిక చేసుకొనబడు సూత్రముల చేత నిర్దేశింపబడుచుండు జీవిత విధానమును రూపొందిస్తుంది. పేతురుకైతే, దేవుని చేత ఆదేశింపబడిన సూత్రములు మాత్రమే జీవితమునకు మార్గనిర్దేశనము నియ్యడానికి యోగ్యమైన సూత్రములై యుండినవి. దేవునికి మహిమతెచ్చు నడవడి "పరిశుద్ధమైన ప్రవర్తనయై" యున్నది ఎందుకనగా అది దేవుని అస్థిత్వమును మరియు స్వభావమును ప్రతిబింబిస్తుంది. "భక్తి" (*eusebeia*) అని పేతురు చేత అనువదింపబడిన పదము విశ్వాస సహితమైన జీవితములో కూడ నుండు భయముగల, నిశ్శబ్దమైన, మరియు భయభీతితో నిండిన ఆశ్చర్యమును సూచిస్తుంది. ఈ సందర్భంలో, అది ప్రత్యేకంగా ఈ విశాల విశ్వముపై నున్న దేవుని సార్వభౌమమైన పాలన గూర్చిన నిశ్చయత నుంచి వెలువడు జీవిత క్రమమును సూచిస్తుంది.

**వచనము 12. దేవుని దినపు రాకడ** యొక్క కచ్చితమైన సమయమును లెక్కలు వేసుకొనడంలో యేసు అనుచరులు కొంత ఆసక్తిగలవారైనట్లయితే, అది రానైయున్న విషయం ఉదాసీనతతో ఉండాల్సిన విషయమై యుండదు. అది భయముతో కూడిన ఒక సమయానికి బదులుగా, ఎదురుచూపుతో కూడిన సమయమై యున్నది. ఆ దినము కొరకు క్రైస్తవులు **ఆశతో అపేక్షించుచు, దానిని త్వరపెట్టుతున్నారు**. క్రైస్తవులు ఈ దినమును తమ మనస్సులో ఎల్లప్పుడు తాజాగా ఉంచుకొనవలెనని పేతురు ఆశిస్తున్నాడు. వారు దాని గూర్చి మననం చేయాలి, దాని అర్థమేమిటో ఆలోచించాలి, తదనుగుణంగా వారి జీవితములను క్రమపర్చుకొనాలి. కీర్తనలు మరియు ప్రవక్తల గ్రంథాల ప్రకారం, జ్ఞానులైనవారు దేవుని కొరకు కనిపెట్టుకొని యుంటారు. ఆయన తనకిష్టమైన ప్రకారం, తన కిష్టమైన సమయంలో, తన కిష్టమైన విధానాల ప్రకారం పనులు చేస్తారనే విషయం వారికి తెలియును. లోకంలోని అన్యాయము మరియు దుష్టత్వము అంతమౌతుందని తెలిసియుండుటతో జ్ఞానులైనవారు తృప్తిచెంది యుందురు. "యెహోవా కొరకు నేను కనిపెట్టుకొనుచున్నాను, నా ప్రాణము ఆయన కొరకు కనిపెట్టుకొనుచున్నది, ఆయన మాట మీద నేను ఆశ పెట్టుకొని యున్నాను. కావలివారు ఉదయము కొరకు కనిపెట్టుట కంటె ఎక్కువగా నా ప్రాణము ప్రభువు కొరకు కనిపెట్టుచున్నది" (కీర్తనలు 130:5, 6).

యెవడును నశింపవలెనని ఇచ్ఛయింపక, అందరు మారుమనస్సు పొందవలెనని కోరుచు, ఆయన దీర్ఘశాంతము గలవాడై, దేవుడు తీర్పును ఆలస్యం చేసాడని పేతురు, అంతకు మునుపు సెలవిచ్చాడు (3:9). మారుమనస్సు మరియు భక్తితో కూడిన జీవితము ద్వారా, "దేవుని దినపు రాకడ కొరకు" క్రైస్తవులు తమ్మునుతాము సిద్ధపరచుకొనగలరు మరియు లోకాన్ని సిద్ధపరచగలరు. విదితంగా, మానవుల ప్రవర్తనకు దేవుడు ప్రతిస్పందిస్తాడు. కొంత మేరకు, దేవుని ఆగమన తీర్పు మానవుల స్వాతంత్ర్యమునకు సంబంధించిన ఒక ప్రతిస్పందనయై యుంటుంది. ప్రభువు ఎప్పుడు తిరిగి వచ్చును, ఆయన ఎప్పుడు తీర్పు తీర్చును అనేది, లోకము యొక్క ఆత్మసంబంధమైన పరిస్థితినిబట్టి నిర్ధరింపబడును. అందరును మారుమనస్సు నొందడానికి ఆయన చాలినంత సమయము అనుగ్రహించినప్పుడు, క్రైస్తవులు తమ్మునుతాము సిద్ధపరచుకొనినప్పుడు ప్రభువు తిరిగి వచ్చునని పేతురు ధ్వనిస్తున్నాడు. ఈ విధంగా విశ్వాసులైనవారు "దేవుని దినపు రాకడను త్వరపెట్టుట ద్వారా" దేవుని మహిమ కొరకు దోహదపడగలరు.

పేతురు "దేవుని దినపు రాకడ"కు ప్రత్యామ్నాయంగా సర్వసాధారణమైన "ప్రభువు దినము" అనే పదజాలాన్ని ప్రయోగించడం ఆశింపబడలేదు, కాని అతని మనస్సులో మరొక భావం ఉండిందని సూచించే సూచనలు కూడ ఏవీ లేవు. ఈ భాషా సరణి ఆశింపబడలేదు. ఇందు వలన, దీని విషయంలో మనము ఎక్కువ సావధానంగా ఉండాలని కోరబడుతున్నాము. "రాకడ" (*parousia*) అని అనువదింపబడిన పదము సామాన్యంగా ఈ అంశమునకు సంబంధించినంత వరకు యేసు రాకడ విషయంలో వాడబడుతుంది. నిస్సందేహంగా, "దేవుని దినపు రాకడ" మరియు 3:4లోని "ఆయన రాకడను గూర్చిన వాగ్దానము" ఒకే సంఘటనను సూచిస్తున్నాయి.

సిద్ధాంత రీత్యా, భూమి అంతమగుట గూర్చినవి అనేక విధానాలున్నాయి. ఒక భారీ ఉల్క భూగ్రహాన్ని ఢీకొట్టవచ్చు, తత్ఫలితంగా సమస్త జీవరాశిని నాశనం చేయవచ్చు. భూమిని దహించివేయడానికి మానవుడు చేజేతులా చేసికొనిన మారణ హోమం కొరకైన అణ్వాయుధాలు చాలినంతగా నిలువ ఉంచబడియున్నవి. రోగాలు, మారిపోతున్న వాతావరణ పరిస్థితులు, లేదా ఇలాంటివే యింకా ఎన్నో "స్వాభావికమైన" సంఘటనలు మానవుల కాలాంతానికి దారితీయవచ్చు. యుగాంతము ఆలోచనలేవి విధి యొక్క ఫలితమై యుండదనే విషయాన్ని పేతురు స్పష్టంచేస్తున్నాడు. అంతము వచ్చినప్పుడు అది తీర్పునకు సంబంధించిన ఒక వ్యక్తిగతమైన చర్యయై యుంటుంది. మానవుని కాలము అంతమైనప్పుడు దేవుడు అంతం చేయడం మూలాన్నే అది అలా అంతమవుతుంది.

"దేవుని దినపు రాకడ" వస్తుంది గనుక, **ఆకాశములు రవులుకొని లయమైపోవును, పంచభూతములు మహావేంద్రముతో కరిగిపోవును**. 3:7లోని "ఆకాశము" మరియు "భూమి" ఈ వచనంలోని "ఆకాశములు" మరియు "పంచభూతములకు" సమానమైనవై యున్నవి. ఎవరేగాని పాపముతో చెలగాటమాడకూడదనేది పేతురు ధ్వనింపై యున్నది. ఒకడు జీవించు తీరు గంభీరమైన విషయమై యున్నది. దేవుడు ప్రేమగల తండ్రియై యున్నాడు; అదే సమయంలో ఆయన "దహించు అగ్నియై" యున్నాడు (ద్వితీయోపదేశకాండము 4:24; హెబ్రీయులకు 12:28-29). అన్యాయన్ని, దౌర్జన్యాన్ని, నిర్దాక్షిణ్యమైన హింసలను, లేదా లోకంలోని మరేవిధమైన చెడులను ఆయన చూచీచూడనట్టు ఉండడు మరియు వాటిని

దాటివెళ్లదు.

**వచనము 13.** దేవుడు యెషయా ద్వారా, "ఇదిగో, నేను క్రొత్త ఆకాశమును మరియు క్రొత్త భూమిని సృజించుచున్నాను; మునుపటివి మరువబడును, జ్ఞాపకమునకు రావు" అని వాగ్దానం చేసాడు (యెషయా 65:17). ప్రవక్త ఇశ్రాయేలు దేశము యొక్క పునర్నిర్మాణము గూర్చి మాటలాడుచుండెను. పేతురు ఈ మాటలను యెషయా గ్రంథంలో నుంచి అరువ తెచ్చుకొని అనుకూలించుకుంటూ, రక్షింపబడివారి నిత్య జీవము గూర్చి చెప్పడానికి వాటిని ప్రయోగిస్తున్నాడు. ఈ **క్రొత్త ఆకాశము** మరియు **క్రొత్త భూమి ఆయన ఇచ్చిన వాగ్దానము ప్రకారమైనవై ఉంటాయని** అపొస్తలుడు చెప్పగలుగుతున్నాడు. బహుశా పేతురు యెషయా గ్రంథంలోని వాగ్దానమును ప్రస్తావించుచుండి యుండవచ్చు. మరోవిధంగా లియకుంటున్న యేసు అపొస్తలులకిచ్చిన వాగ్దానమును ఆయన సూచించుచుండుననేది మరొక సాధ్యతయై యున్నది. ప్రత్యామ్నాయంగా, ఈ నూతన ఆకాశము మరియు నూతన భూమి వాగ్దానము గూర్చి పేతురునకు పరిశుద్ధాత్మ బయలుపరచి యుండవచ్చు.

నూతన ఆకాశము మరియు నూతన భూమి అంతులేని ఊహాగానాలకు సంబంధించిన అంశమై యుండినవి. తోడేలు, గొఱ్ఱెపిల్ల, సింహము, మరియు దూడయు కలిసి పరుండుటకు అనువైనదైయుండు సమాధానము గూర్చి అంతకు మునుపు యెషయా జీవకళగల ఒక సన్నివేశాన్ని వర్ణించాడు (యెషయా 11:6). అలాగైతే ఇది నూతన ఆకాశము మరియు భూమి గూర్చిన ఒక అక్షరార్థమైన వర్ణన యని మనం అర్థంచేసికొనవలసి ఉంటుందా? పరిశుద్ధుడైన యోహాను పత్మసు ద్వీపంలో పరవాసియై యుండగా, "అంతట నేను క్రొత్త ఆకాశమును క్రొత్త భూమిని చూచితిని; మొదటి ఆకాశమును మొదటి భూమియు గతించిపోయెను" అని రచించాడు (ప్రకటన 21:1).

అపొస్తలులు దేని గూర్చి చెప్పుచుండిరి? క్రొత్త భూమి ప్రస్తుత కాలంలో ప్రజలంతా నివసిస్తున్న అదే భూగ్రహమై యుంటుందా? ఈ గ్రహం ఏదో ఒక విధంగా దేవుని ప్రజలకు నిత్య నివాసము వలె పునఃరుద్ధరింపబడినదై యుంటుందా? ఏది ఏమైనా, ప్రకటన గ్రంథంలోని నూతనమైన యెరూషలేము "పరలోకమందున్న దేవుని యొద్ద నుండి దిగి వచ్చుచున్నదనేది" గమనార్హమైన విషయమై యున్నది (ప్రకటన 21:2). నూతనమైన యెరూషలేము, బహుశా విమోచింపబడినవారి నిత్య నివాసమునకు ప్రతినిధియై యున్న చోటు, భూమి మీదికి దిగివచ్చుచున్నట్టుగా అగుపిస్తుంది. అట్లయినప్పటికిని, ఈ విషయం అనిశ్చయంగా ఉన్నది, గనుక మనము ప్రకటన గ్రంథాన్ని అక్షరాలా వ్యాఖ్యానించునప్పుడు జాగ్రత్తపరులమై యుండాలి.

ప్రస్తుత యుగమునకు మరియు రానైయున్న యుగమునకు మధ్యగల సమగ్రమైన ఒక తెగింపును పేతురు అదివరకే రూఢిపర్చాడు. "ఆకాశములు రవులుకొని లయమైపోవును," మరియు "పంచభూతములు మహా వేండ్రముతో కరిగిపోవును" అని రాస్తున్నాడు (3:10). ఎంతైనా, పాత మరియు క్రొత్త వాటికి మధ్య కొనసాగింపు ఉంటుందని అపొస్తలుడు ఇప్పుడు చెప్పుతున్నాడా? పరలోకం, భూమిని పోలిన ఉనికిగల దానివంటిదే, కాని మానవాళిని ప్రస్తుతం పీడిస్తున్న పాపము మరియు శ్రమ లేనిదై యుంటుందా? ఇదొక సాధ్యతయే, కాని బహుశా పేతురు ఇటువంటి దానిని దేనినైనను భావించియుండకపోవచ్చు. బహుశా విశ్వాసులు ఆయనతో కూడ నిత్యత్వమందు చిరకాలము నివసించు నిమిత్తము అవసరమైన

సమకూర్పులు దేవుడు చేసియున్నాడని వారికి అభయమియ్యవలెనని మాత్రమే పేతురు ఆశించియుండవచ్చు. బహుశా "నూతన ఆకాశము మరియు నూతన భూమి" అనగా, రక్షింపబడినవారు ఎక్కడో ఒక చోట నివసిస్తారనే అర్థమై యుండవచ్చు. నిత్య జీవమనేది వెలుగు గాని చిరునవ్వుల చిందులాటలుగాని లేని ఏదో మసకమసకగా నున్న, దౌర్భాగ్యమైన ఒక నివాస స్థలం అయియుండదు. దేవుడు దానిని సమకూర్చాడు. గనుక దాని నిత్య అస్తిత్వము యొక్క స్వభావము గూర్చిన మరింత ఊహాగానం లేకుండానే పేతురు నిత్య జీవమును గూర్చి అభయమిస్తున్నాడు.

## ఓర్పుతో కూడిన ప్రయత్నమునకైన పిలుపు (3:14-16)

**14ప్రియులారా, వీటికొరకు మీరు కనిపెట్టువారు గనుక శాంతముగలవారై, ఆయన దృష్టికి నిష్కళంకులుగాను నిందారహితులుగాను కనబడునట్లు జాగ్రత్తపడుడి. 15మరియు మన ప్రభువుయొక్క దీర్ఘశాంతము రక్షణార్థమైనదని యెంచుకొనుడి. ఆలాగు మన ప్రియ సహోదరుడైన పౌలుకూడ తనకు అనుగ్రహింపబడిన జ్ఞానము చొప్పున మీకు వ్రాసి యున్నాడు. 16వీటిని గూర్చి తన పత్రికలన్నిటిలోను బోధించుచున్నాడు; అయితే వాటిలో కొన్ని సంగతులు గ్రహించుటకు కష్టమైనవి. వీటిని విద్యావిహీనులును, అస్థిరులైనవారును, తక్కిన లేఖనములను అపార్థముచేసినట్లు, తమ స్వకీయ నాశనమునకు అపార్థము చేయుదురు.**

పేతురు తన పత్రిక ముగించుచుండిన సందర్భంలో, తన క్రైస్తవ స్నేహితులు భక్తిపూర్వకమైన జీవితమును అత్యంత శ్రద్ధతో వెంటాడవలెనని ఆయన వారిని విన్నవించుకుంటున్నాడు. క్రీస్తును ఒప్పుకొనడం ఒక ఎత్తు; విశ్వాసనీయమమైనవారముగా జీవించడం మరొక ఎత్తు. అపొస్తలుడు తన పాఠకుల ఆత్మసంబంధమైన సంక్షేమమునకు సంబంధించిన రెండు విషయాల గూర్చి ఆందోళన చెందుచుండెను. మొదటిది, ఇంద్రియ సుఖ సంబంధమైన ఆకర్షణలు, ఇటువంటి అభ్యాసములను సంపూర్తిగా పరిత్యజించిన వారిని సహితం ఇట్టే ఆకర్షించుకోడానికి అవి చాలినంత బలమైనవై యుండినవి. స్వయం అతిలాలసత్వం, ఆత్మసంబంధమైన ఒక ఆశీర్వాదమై యున్నదని గుర్తిస్తూ అబద్ధ బోధకులు దానిని సమర్థించినప్పుడు శరీరాశలను ఎదిరించడం, అది యింకా ఎక్కువ కష్టతరమైనదై యుండింది. ఒకడు దేవునితో కలిగియుండు సంబంధం శరీర దురాశల చేత ఎవ్విధంగాను ప్రభావితం కాదని బలముగా ప్రకటించుచుండినవారి చేత పేతురు పాఠకులు ప్రభావితమగుచుండిరి. ఇటువంటి ప్రవర్తన, వారిని దేవుని నుంచి వేరుచేస్తుందని, అపొస్తలుడు వాదించాడు.

సంఘము ఒక ఒప్పుకోలు సంబంధమైన సమాజమై యున్నది. క్రైస్తవులు సార్వత్రికంగా సామాన్యమైనవై యున్న నమ్మకముల చేత కలిసి కట్టుగా కట్టబడి యుంటున్నారు. ఒకని ప్రవర్తనకు వాని విశ్వాసమే బలమైన ఆలంబనమై యుంటుంది. అబద్ధ బోధకులు క్రైస్తవుల విశ్వాసమును బలహీనపర్చుచుండిరనేది పేతురు యొక్క రెండవ ఆందోళనయై యుండింది. సిద్ధాంతము, ప్రవర్తనకు సంబంధం లేనిది కాదు. ప్రభువైన యేసు క్రీస్తు "తన కొరకు

కనిపెట్టుకొని యుండువారి రక్షణ నిమిత్తము పాపము లేకుండ రెండవసారి ప్రత్యక్షమగునని" క్రైస్తవ సిద్ధాంతం బలంగా చాటిస్తుంది (హెబ్రీయులకు 9:28). మనము పరిశుద్ధ జీవితం జీవించవలెనని దేవుడు కోరుతున్న విషయం, యేసు ఒకసారి శరీరధారియై అరుదెంచిన రీతినే, తీర్పు తీర్చడానికి ఆయన మరలా వచ్చుననే అభయం చేత దన్ను ఇవ్వబడుచున్నదై యున్నది. పేతురు తన పత్రికను ముగించుచుండిన సందర్భంలో తన పాఠకులకు గట్టిగా తెలియజెప్పాలని ఆశించిన ఆలోచన ఇదే అయియుండింది.

**వచనము 14**. అపొస్తలుడు తన తోటి విశ్వాసులను **ప్రియులారా** అని సంబోధించడం ద్వారా ఆయనకు వారి యెడల గల అనురాగమును అభివ్యక్తం చేస్తున్నాడు. ఈ పదమును పేతురు ఈ అధ్యాయంలో నాలుగు పర్యాయాలు ప్రయోగించాడు (3:1, 8, 14, 17). ఆయన తన పాఠకులకు ఇచ్చుచున్న మందలింపులో ఆయన వారిని నిందిస్తున్న భావం లేదనే విషయాన్ని స్పష్టం చేయడానికే ప్రీతి గొలిపెడు ఈ పదమును ప్రయోగిస్తున్నాడని ఒకరు అర్థంచేసికొనవచ్చు. **నిష్కళంకము మరియు నిందారహితమునైన** జీవితం జీవించు విషయంలో వారు విఫలులైనందుకు ఆయన అవశ్యంగా వారిపై నేరమును అరోపించడం లేదు. ఆయన వారి దృఢసంకల్పమును గట్టిగా బలపర్చుచుండెను, వారు జ్ఞాపకముంచుకొనవలసినదనే విషయాన్ని జ్ఞాపకం చేయడం ద్వారా నిర్మలమైన వారి మనస్సులను రేపుచుండెను (3:1). క్రైస్తవులు వారి ప్రభువును పోలి నడుచుకొనుచున్నవారుగా జీవించాల్సినవారై యుండిరి. 1 పేతురు 1:19లో, అపొస్తలుడు యేసు రక్తమును తొలుత పరోక్షంగా ప్రస్తావించాడు, ఆ తరువాత, ప్రభువు "నిర్దోషమును నిష్కళంకమునగు" (*amōmou kai aspilou*) ఒక గొఱ్ఱెపిల్లయై యుండెనని చెప్పాడు, సరికగా పరిశుద్ధమైన జీవితములు జీవించవలెనని విన్నవించుట కోసం అవే పదములను ఈ వచనంలో కూడ ప్రయోగిస్తున్నాడు.[10] యేసు నామమును ధరించినవారు భక్తిపూర్వకమైన జీవితం జీవించడానికి అవసరమైన ప్రేరేపణను ఆయన ప్రదర్శించిన మాదిరిలోనే కనుగొంటారు.

క్రైస్తవ వేదాంతశాస్త్రం క్రైస్తవ ప్రవర్తనతో విడదీయరాని విధంగా కలిపికట్టబడి యున్నది. యేసే క్రీస్తనియు, దైవము శరీరధారియైనాడనియు ధ్రువీకరించడం, మానవ జీవితానికి గౌరవము మరియు ప్రాముఖ్యత కలవని ధ్రువీకరించడమై యున్నది. మోషే ఇశ్రాయేలు ప్రజలకు తెలియజెప్పిన మాటలు పేతురు మొత్తానికే భిన్నమైనవేమీ కావు. "కాబట్టి, పైనున్న ఆకాశమందును క్రిందనున్న భూమియందును యెహోవాయే దేవుడనియు, మరియొక దేవుడు లేడనియు నేడు నీవు ఎరిగి జ్ఞాపకమునకు తెచ్చుకొనుము" అని ధర్మశాస్త్రము నిచ్చినవాడు పలికాడు (ద్వితీయోపదేశకాండము 4:39).

మోషేకును మరియు పేతురునకును, మానవ చరిత్ర కేవలం భౌతిక విశ్వమనెడు పళ్ళచక్రంలో ఒక పల్లు వంటిది, దురదృష్టకరమైన ప్రమాదాల మూలాన ఇక్కడ వెలయుచు, ఆలోచనలేని యాదృచ్ఛికమైన సంఘటన వంటిది కాదు. ఒక్కొక్కరి, ప్రతి ఒక్కరి నీతి ప్రాముఖ్యమైన విషయమై యున్నది. పైనున్న అకాశమందును క్రిందనున్న భూమియందును దేవుడై యున్నవాడు "నీతి నివసించు క్రొత్త ఆకాశమును మరియు క్రొత్త భూమిని" సిద్ధపర్చుచున్నందుకే అది ప్రాముఖ్యమైన విషయమై యున్నది. **వీటి కొరకు మీరు కనిపెట్టువారు గనుక** పరిశుద్ధ జనమై యుండవలెనని ఇవ్వబడుతున్న హెచ్చరిక సార్థకమైనదై యున్నది. క్రీస్తు ఆగమనము క్రైస్తవ సిద్ధాంతమునకు ఒక ఆవశ్యకమైన

ఆకృతియై యున్నది. చరిత్ర మరియు కాలము పరాకాష్ట దిశగా పయనిస్తున్నాయి. యేసే క్రీస్తని ఒప్పుకొనువాడెవడును వాని నైతిక ఎంపికలను క్రమరహితంగా చేసికొనజాలడు. ఈ హేతువునుబట్టి, **శాంతముగలవారై, ఆయన దృష్టికి ... కనబడునట్లు జాగ్రత్తపడుడి** అంటూ పేతురు తన ఆదేశాలను జారీచేస్తున్నాడు.

"శాంతముగలవారై" అనే పదజాలము చేర్చబడటం ఏదో ప్రమాదవశాత్తు జరుగలేదు. ఈ చిన్న పత్రికలో ఈ పదము ప్రయోగింపబడింది ఇదొక్కమారే. ప్రభువు తిరిగి వచ్చినప్పుడు, తానైతేనేమి మరియు తన పాఠకులైనతేనేమి, దేవుని యెదుట పాపదోషము లేనివారుగా నిలువబడలేననేది పేతురు కలిగియున్న నిరీక్షణయై యున్నది. "శాంతముగలవారై" అనగా, "రక్షింపబడినవారై" అని అర్థం, కాని అది ఇంతకు మించిన భావముగలదై యుండవచ్చు. ఒకడు దేవునితో కలిగియున్న సమాధానం వాడు తన తోటి సహోదర సహోదరీలతో ముఖాముఖిగా కలిగియుండు సమాధాన సహితమైన జీవితం చేత గుర్తింపబడునదిగా ఫలిస్తుంది. క్రీస్తునందుండు వాడు సంఘములో అనగా, ఇహలోకము లోని ఆయన రాజ్యములో అనుభవించుచుండు సమాధాన సహితమైన ఆశీర్వాదము నుంచి, భవిష్యత్తులో తాననుభవింపవలసి యున్న నూతన ఆకాశము మరియు నూతన భూమిపై వెలయుచుండు సమాధానము దిశగా వెళ్లుచుండును.

**వచనము 15.** ఆయన సెలవిచ్చిన దానిని, సెలవిచ్చిన ప్రకారం, తన సమయంలో చేయునని దేవుడు సెలవిచ్చినది చేయునంత వరకు వేచియుండటానికి దేవుని యందు విశ్వాసముంచువారు సహితం కష్టపడుతుంటారు. గనుక అది అబద్ధ బోధకులకు వారి స్వలాభానికి ఉపయోగపడు సానుకూలమైన నెపమయ్యింది. "ఆయన రాకడను గూర్చిన వాగ్దానమేమయెను?" అని వారు ప్రశ్నించారు (3:4). అపొస్తలిక సందేశము తప్పనేది అబద్ధ బోధకులిచ్చుచుండిన వివరమై యుండింది. రాకడ అనేది జరుగదు, కనీసం దాని అక్షరార్థంగానైనా అది సంభవించదు. పేతురిచ్చుచుండిన వివరము భిన్నంగా ఉండింది. దేవుడు ఆలస్యంచేస్తున్నాడంటే, "యెవడును నశింపవలెనని యిచ్ఛయింపక, అందరు మారుమనస్సు పొందవలెనని కోరుచు, మీ యెడల దీర్ఘశాంతముగలవాడై యున్నాడని" అపొస్తలుడు చెప్పుచుండెను (3:9). ఆ తరువాత పేతురు ఈ ఆలోచనను 14వ వచనానికి కలుపుతున్నాడు. తీర్పు మరియు నిత్యత్వము ఆలస్యం చేయబడినప్పటికిని క్రైస్తవులు దేవుని వైపు కృతజ్ఞతతో చూడవచ్చునని పేతురు చెప్పుచుండెను. దేవుడు ఆలస్యం చేస్తున్నాడంటే, ఆయన దీర్ఘశాంతము యింకా ప్రయోజకరంగా పనిచేస్తున్నదనేది దాని అర్థమై యున్నది. విశ్వాసులు, **మన ప్రభువు యొక్క దీర్ఘశాంతం రక్షణార్థమైనదని యెంచుకొనుడి**. అనగా అత్యధిక సంఖ్యాకులు మారుమనస్సు పొందడానికి దేవుడు వారికనుగ్రహిస్తున్న తరుణం వారి "రక్షణ" కొరకైనదని అర్థం. "ఆయన రాకడ" సంభవించినప్పుడు, "రక్షణ" ద్వారము మూసివేయబడుతుంది.

ఈ సందర్భములో, పౌలు రాసిన పత్రికలను పేతురు పరోక్షంగా పేర్కొంటున్నాడు. తాను రచించిన వాటి గూర్చి పౌలు ప్రస్తావించిన తన సొంత ప్రస్తావనలు మినహాయిస్తే, ఒక పత్రిక రచయితగా పౌలు గూర్చి చేయబడిన క్రొత్త నిబంధన ప్రస్తావన ఇదొక్కటే. అపొస్తలుల కార్యముల గ్రంథంలో ఇటువంటి ప్రస్తావన ఏదియు లేకపోవడం ప్రత్యేకంగా గమనార్హమై విషయమై యున్నది. పౌలు రాసిన పత్రికలు సంఘ చరిత్రలో ఎంతో పెద్దగా

పెంబడినట్లు మసకమసకగా అగుపించుచుండినప్పటికిని లూకా చేత అవి ఎందుకు పేర్కొనబడలేదో ఊహించడానికి కష్టతరంగా ఉన్నది. కారణమేదైనా, పౌలు పత్రికల గూర్చి క్రొత్త నిబంధనలో పౌలుకు సంబంధంలేని ఒకే ఒక్క ప్రస్తావన, ఇచ్చట, పేతురు రాసిన రెండవ పత్రికలో ఉన్నది.

ఇచ్చట కూడ, పౌలు పత్రికల గూర్చి పేతురు చేసిన ప్రస్తావన ప్రధానాంశనమునకు కాకతాళీయమైందిగా ఉండింది. అబద్ధ బోధకులు పౌలు సందేశమును వక్రీకరించుచుండిరి గనుక పేతురు వాటి గూర్చి ఆసక్తిగలవాడై యుండెను. అతడు మరియు పౌలు కూడ ఒకే సందేశాన్ని బోధించారనే విషయాన్ని స్పష్టం చేయాలని పేతురు ఆశిస్తున్నాడు ప్రామాణిక గ్రంథముల గూర్చిన ప్రశ్నలపై ప్రభావముగలవి పేతురు మాటల్లో నుంచి రాబట్టుకొనాల్సినవి బహుశా న్యాయసమ్మతమైన అనుమితములుండవచ్చు, కాని పేతురు యొక్క ప్రాధాన్యమైన ఆలోచనలతో పోల్చినట్లయితే, ఇటువంటి విషయాలు అంత ముఖ్యమైనవి కావు.

పౌలు పత్రికల గూర్చి పేతురు ప్రస్తావించడంలో ఒక హేతువున్నదని స్పష్టమౌతుంది: వాటిలో ఆయన క్రైస్తవులకు పేతురు చేసిన అవే బోధలు చేసాడు, అనగా, వారు "మన ప్రభువు యొక్క దీర్ఘశాంతం రక్షణార్థమైనదని యెంచవలెను." **ప్రియ సహోదరుడైన పౌలు కూడ, తనకు అనుగ్రహింపబడిన జ్ఞానము చొప్పున**, పేతురు ప్రకటించిన అదే సందేశమును ప్రకటించాడు. సంఘమునకు బలమైన స్తంభములై యుండిన ఈ ఇరువురి మధ్య పోటీ గాని అభిప్రాయభేదం గాని ఉన్నట్టు ఎటువంటి సూచనయైనను లేదు.

ఆయన చెప్పుచుండిన విషయానికి ఆలంబమిచ్చుటనవి పేతురు మనస్సులో పౌలు పత్రికలలోని ఏ యే వాక్యభాగాలు ఉండినవో అని పాఠకులు ఆశ్చర్యంలో ముంచెత్తబడుతున్నారు. ఇదొక సుళువైన ప్రశ్న కాదు. పేతురు రెండవ పత్రిక ఆరవ శతాబ్దం మధ్యకాలంలో వ్రాయబడి యున్నట్లయితే, అప్పటికి పౌలు వ్రాసిన పత్రికలో అధిక శాతం అందుబాటులో ఉండినవి. ఏది ఏమైనా, ఈ రచనలలో ఏవేవి పేతురు మరియు ఆతని పాఠకులకు సుపరిచితమైనవై యుండినవో మనకు తెలియదు. రోమా పత్రిక సుపరిచితమైనదై యుండవచ్చు, అందులో పేతురు వ్యక్తం చేసిన దాని వంటిదే పౌలు రసమయమైన ఒక మనోభావాన్ని తెలుపుతున్నాడు: "లేదా, దేవుని అనుగ్రహము మారుమనస్సు పొందుటకు నిన్ను ప్రేరేపించుచున్నదని యెరుగక, ఆయన అనుగ్రహైశ్వర్యమును సహనమును దీర్ఘ శాంతమును తృణీకరించుదువా?" (రోమా 2:4).

పేతురు రెండవ పత్రిక నాలుగవ శతాబ్దము ముగింపు రోజుల్లో రచింపబడినట్లయితే, *ఉపోద్ఘాతములో* పేర్కొనబడినట్లుగా పేతురు ప్రస్తావిస్తున్న పౌలు పత్రికలు క్రొత్త నిబంధన లోనికి చేర్చబడినవి గాక ఇతరమైన కొన్ని పత్రికలై యుండినవనేది సాధ్యమౌతుంది. విషయం ఇదైనట్లయితే, ముందుకు సాగాలని పేతురు ఆశించిన అదే తర్కమును చేయునవి పౌలు పత్రికలలో అనేక వాంగ్మూలములను మనము కనుగొనలేకపోతున్న దానికి అది కారణమౌతుంది.

**వచనము 16.** ఒక విషయం నిశ్చయమైనదై యున్నది. అదేమనగా: పౌలు చేత రచింపబడినవని పేతురునకు మరియు తన పాఠకులకు పరస్పరం తెలిసియుండిన పత్రికలుండినవి. పౌలును ఒక మిత్రుడుగా పరిగణిస్తూ, పౌలు పత్రికలలోని విషయాలను పేతురు సునాయసంగా ప్రయోగించుకొనుచుండెను. పౌలు **వీటిని గూర్చి తన**

**పత్రికలన్నిటిలోను** పేతురు సంబోధించిన అవే సంఘాలకు రచించాడు. సంఘములను ప్రభావితము చేయాలని ప్రయత్నించుచుండిన అబద్ధ బోధకులను పేతురు మరియు పౌలు కలసి ఎదుర్కొన్నారు. ప్రత్యేకంగా, ప్రభువు రాకడ ఆలస్యమగుచుండిన విషయంలో వారు కలిసికట్టుగా నిలబడ్డారు. ఈ ఆలస్యం ఇంకను మారుమనస్సు పొందనివారి కొరకు "రక్షణార్థమైనదని" ఇద్దరూ బోధించారు.

అబద్ధ బోధకులు, వారి జ్ఞానమే అతీతమైనదంటూ సాధికారంతో చెప్పుకొనుచుండనప్పటికిని, వారు **విద్యావిహీనులును**, **అస్థిరులైనవారై** యుండిరి. వీరు పౌలు పత్రికలోని కొన్ని సంగతులు **గ్రహించుటకు కష్టమైనవిగా ఉండిన తక్కిన లేఖనములను అపార్థము చేసినట్లు,** అపార్థము చేయుదురు. "గ్రహించుటకు కష్టమైనవి" (*dusnoētos*) అని అనువదింపబడిన పదము క్రొత్త నిబంధనలో ఇచ్చట మాత్రమే అగుపిస్తుంది. క్రొత్త నిబంధనకు వెలుపల సహితం అదొక అరుదైన పదమై యున్నది; కాని *Shepherd of Hermas* అని పిలువబడిన రెండవ శతాబ్దం నాటి రచనలో, అవి అర్థంచేసికోడానికి మరియు వివరించడానికి కష్టంగా ఉన్నాయని రచయిత చెప్పుచుండిన దర్శనముల సందర్భంలో అది ప్రయోగించబడింది.[11] సహజంగానే, పేతురు, ఏ దర్శనము గూర్చి ప్రస్తావించలేదు, కాని పౌలు రచించిన కొన్ని విషయాలు అర్థం చేసికోడానికి కష్టతరంగా ఉండినవనియు, గనుక వక్రీకరింపబడటానికి అనువైనవిగా ఉండినవనియు అంగీకరించాడు. పౌలు రచనలలోను మరియు "తక్కిన లేఖనములలోను" గ్రహించుటకు కష్టమైనవిగా ఉండిన విషయాలు, భాషలో సందిగ్ధార్థం ఉండినదనడానికి ఒక సాక్ష్యమై యుంటున్నవి.

సిద్ధాంతపరంగా, తన సృష్టిజాలమంతటితో ముచ్చటించడానికి దేవుడు భాషనే గాక కొన్ని ఇతర సాధనములను ప్రయోగించుకొనగలిగి యుండెను. మానవ మనస్సుల్లోనికి ఆయన ప్రత్యక్షతలను సూటిగా నాటియుండేవాడే. ఆయన ఎవరై యున్నాడో, తన ప్రజల నుంచి ఆయన కోరుతున్నదేమిటి, క్రీస్తు ప్రాముఖ్యత, మరియు ఇటువంటివి యింకా ఎన్నో విషయాల గూర్చి తప్పించుకోడానికి వీలులేని కొంత అవగాహనతో మనలను నింపియుండేవాడే. ఈ విధంగా ఆయన తననుతాను బయలుపర్చుకొనేవాడే, కాని దానికి బదులుగా ఆయన మరొక మార్గాన్ని ఎన్నుకున్నాడు. దేవుడు తనను తాను తన ప్రజలకు బయలుపర్చుకోడానికి భాషను ఎన్నుకున్నాడు. భాష ఒక మాధ్యమమైనప్పుడు, అది అపార్థం చేసికొనబడవచ్చు మరియు అపార్థం చేసికొనబడుతుంది కూడ, ఇంకా, ఇందుకు ఉన్ముఖులై యున్నవారు దానిని వక్రీకరిస్తారు.

భాషలో గల సందిగ్ధార్థమునుబట్టి, కొందరు సత్యమును తెలిసికొనడాన్ని మానివేస్తారు. పిడివాదము అసౌకర్యంగా ఉన్నవారు క్రైస్తవ విశ్వాసం గూర్చి ఒప్పుకోదగినదిగా నున్న స్వభావాన్ని మననం చేయాలి. క్రైస్తవ్యము, ధ్రువీకరణములతో ఆరంభమౌతుంది మరియు అంతమౌతుంది దేవుడు సృష్టికర్తయై యున్నాడు. యేసు క్రీస్తు మెస్సీయయై యున్నాడు. యేసు మనకు బదులుగా సిలువ మీద మరణించాడు. ఆయనే రక్షణకు మూలాధారమై యున్నాడు. ఆయన తిరిగి వచ్చును. భాష సందిగ్ధార్థంతో కూడినదై యున్నది, కాని బొత్తిగా నిరాశాజనకంగా సందిగ్ధార్థంతో లేదు. ఇంతేగాక, అందునుబట్టి, "గ్రహించుటకు కష్టతరమైనవిగా నున్న విషయాలు" ఆషామాషీ విషయాలు గాని సులభంగా

అలక్ష్యంచేయాల్సిన విషయాలనుగాని కావు. పేతురు మాటలు, ఒక విధంగా సూటిగా లేనివి, విశ్వాసులు విద్యార్థులై ఉండాలని పిలుపునిచ్చుచున్నవి. విశ్వాసులైన క్రైస్తవులు "గ్రహించుటకు కష్టమైనవిగా నున్న" విషయాలను ఎంత వరకు ప్రక్కకు నెట్టైస్తే అంతవరకు "విద్యావిహీనులును అస్థిరులైనవారును" వాస్తవంగా, **తమ స్వకీయ నాశనమునకు** వాటిని "అపార్థము చేయుదురని" కూడ ఒకరు చెప్పవచ్చు.

అబద్ధ బోధకులు "తక్కిన లేఖనములను అపార్థము చేసినట్లు" పౌలు పత్రికలను "అపార్థము చేయుదురనే" పేతురు వాంగ్మూలము కొన్ని ముఖ్యమైన ప్రశ్నలను లేవదీస్తుంది. "లేఖనములు" (*graphē*) అనే పదమునకు సంబంధించిన గ్రీకు పదము జాతివాచకమై యున్నది; అనగా, అది దేనినైనా సూచింపవచ్చు. కాలక్రమేపి అదొక సాంకేతికపరమైన పదమయ్యింది. మొదట యూదులు, ఆ తరువాత క్రైస్తవులు ప్రాచీనమైన గ్రంథాలలో కొన్ని మానవుల చేత ఉత్పత్తిగావింపబడిన వాటిని మించినవై యున్నవి ఆలోచించడానికి మొదలుపెట్టారు. వారు వ్రాసింది దేవుని వాక్యమైయుండునట్లు దేవుని **ఆత్మ** దేవుడు ఏర్పరచుకొనిన మనుష్యుల ద్వారా మరియు మనుష్యులలోను, అనగా, గ్రంథకర్తలు ప్రేరేపింపబడిరని చెప్పుకొనబడుచున్న విధంగా, పనిచేసాడని వారు నమ్మారు. బహుశా ప్రేరేపణ అనేది, మాటలు ప్రజల్లో భక్తిరహితమైన ఫలము ఫలించుటకు పనిచేయునట్లు రచనలు పరిశుద్ధాత్మ చేత శక్తితో చొప్పింపబడినవే అర్థం కూడ ఇవ్వవచ్చు. ప్రేరేపింపబడిన రచనలను సూచించడానికి "లేఖనములు" ఒక సాంకేతికపరమైన పదమయ్యింది. దైవభక్తిగల ప్రజలు వాటిని అత్యున్నతంగా గౌరవించారు, అవి దేవుని నుంచి కలిగినవని పరిగణించారు, కొంత మేరకు విడ్డూరమైన అవగాహన చొప్పున, అవి ఆయన మాటలేగాక మానవులైన గ్రంథకర్తల మాటలై యున్నవని ఎంచారు.

క్రొత్త నిబంధన దాని రూపును దిద్దుకొనుచుండిన కాలములో, "లేఖనములు" అనేది ఈనాటి క్రైస్తవులు ఎంచు దాని కంటె మార్చబడదగు ఒక పదమై యుండింది. "లేఖనములు" సమాజమందిరములలో లేదా సంఘముల సమావేశాల్లో పఠించుట కొరకు తగిన రచనలై యుండినవి. కచ్చితంగా ఏ యే పుస్తకాలు "లేఖనములు"గా వర్గీకరింపబడినవో, ఏవేవి వర్గీకరింపబడలేదో, కొంత అనిశ్చయత నెలకొనియుండింది. ఏది ఏమైనా, రచింపబడిన గ్రంథాలు ప్రేరేపింపబడినవని చెప్పుకొనబడుచుండిన అంశము గూర్చిన అనిశ్చయత చివరకు ఒక సమస్య అయ్యింది. ప్రాచీన గ్రంథాల్లో, వాస్తవానికి, ఏవేవి లేఖనములై యున్నవని ఎవరు నిర్ణయించారు? ఏ యే గ్రంథాలు ప్రేరేపింపబడినవి? కాలక్రమేపి ఒక అనుకూలాభిప్రాయం అభివృద్ధి అయ్యింది. రచించడానికి తన పరిచారకులను ప్రేరేపించిన దేవుడే, ఏవేవి దేవుని నుంచి పొందబడినవో ఆ గ్రంథాల కచ్చితమైన ఒక సంఖ్యను ఏర్పరచడానికి తన ప్రజల ద్వారా పనిచేసాడనేది క్రైస్తవ విశ్వాసమై యున్నది. ప్రామాణికమైన పరిమాణమునకు నిలిచిన ఈ గ్రంథాలు, అవి ప్రేరేపింపబడినవని దేవుని కటాక్షము చొప్పున నిర్ధరింపబడినవి, "ప్రామాణిక గ్రంథం" అని పిలువబడింది.

యేసు కాలములో, హెబ్రీ బైబిలు యొక్క ప్రామాణిక గ్రంథం స్థిరీకరింపబడిందని తెలియుచున్నది (లూకా 24:44). భిన్నంగా ఏర్పాటుచేయబడి లెక్కింపబడినప్పటికిని, దానిలోని గ్రంథాలు మన ప్రస్తుత పాత నిబంధనలోని 39 పుస్తకాలతో సమానమైనవై ఉన్నాయి. ఇందురు తారతమ్యంగా, సంఘము నెలకొల్పబడుచుండిన తొలి రోజుల్లో, క్రొత్త

నిబంధనలోని పుస్తకములు రచింపబడుచు సేకరింపబడుచుండిన ప్రక్రియలో మాత్రమే ఉండినవి. పౌలు పత్రికలను పేతురు "తక్కిన లేఖనములతో" కూడ వర్గీకరించినప్పుడు, అతని మనస్సులో పాత నిబంధన ఉండియుండవచ్చు. పేతురు మనస్సులో ఇతరమైనవి ఏవైన అపోస్తలిక పుస్తకములు ఉండినవేమో నిశ్చయంగా చెప్పరాదు.

పౌలు పత్రికలు ప్రేరేపింపబడినవని పేతురు భావించాడు. అవి సంఘానికి సాధికారపూర్వకమైనవై ఉండినవి. పేతురు మరణించిన ఒకటి లేదా రెండు శతాబ్దముల తరువాత, బైబిల్‌లోని పుస్తకములకు సంబంధించినంత వరకు ఒక నిర్దిష్టమైన సంఖ్యను, పౌలు రచించిన పదమూడు పత్రికలు మరియు పేతురు రచించిన రెండు పత్రికలతో సహా, అన్నీ కలిసి ప్రామాణికమైనవై యుండునట్లు ఏర్పాటుచేయడానికి దేవుని సంఘంలో ఆయన **ఆత్మ** కార్యం జరిగించాడు. సంఘం విశ్వసించాల్సిందేమిటి, అది జీవించాల్సిన విధానమేమిటి, అది ఏమైయుండాలి, మొదలైన విషయాల్లో ఈ కార్యలు ఆదర్శంగా నిలిచాయి. కాలక్రమేపి, ఈ 27 పుస్తకాలు క్రొత్త నిబంధన యని పిలువబడ్డాయి. ఆధునిక సంఘానికి "లేఖనములు" అనంటే పాత నిబంధన మరియు క్రొత్త నిబంధనలోని ఆరవైఆరు పుస్తకాలని అర్థమియ్యడం ఒక సదభిప్రాయమే.

## అన్వయము

### ప్రభువు రాకడ దినాన్ని త్వరపెట్టుట (3:1–16)

బైబిలు ఈ క్రింది విధమైన సారాంశంగా చెప్పుకొనబడుతుందని చెప్పుకొనబడుతుంది: (1) "ఎవరో ఒకడు వస్తున్నాడు" అనేది పాత నిబంధన ప్రధానాంశమై యున్నది. (2) "ఎవరో ఒకడు ఇచ్చట ఉన్నాడు" అనేది నాలుగు సువార్తల ప్రధానంశమై యున్నది. (3) "ఎవరో ఒకడు రానైయున్నాడు" అనేది మిగిలిన క్రొత్త నిబంధన ప్రధానాంశమై యున్నది. పేతురు తన రెండవ పత్రిక రచించినప్పుడు ఒక దశాబ్దం లేదా అంత కంటె కొంచెం ఎక్కువ కాలం క్రైస్తవ విశ్వాసులై యుండినవారిని సంబోధించాడు. ప్రభువు తిరిగి రానై యున్నాడని వారు అర్థం చేసుకున్నారు. సంవత్సరములు గడిచిపోయాయి గాని ఆయన తిరిగి రాలేదు గనుక జీవనం మునుపటి వలెనే కొనసాగింది. వారు వినిన విషయం వాస్తవమైనదే అని తన పాఠకులకు అభయమిస్తూ పేతురు ఈ పత్రికను ముగిస్తున్నాడు: ప్రభువు తిరిగి వస్తాడు. తన పాఠకులు ఈ క్రింది సూత్రములను అర్థంచేసికోవాలని పేతురు ఆశించాడు:

(1) *లోకము ప్రభువు నియమించిన ముగింపు దిశగా ముందుకు దూసుకెళ్తుందని విశ్వాసముంచెడి వారిని ఎగతాళిచేసెడి విశ్వాసహీనులు మరియు అనుమానితులు ఎల్లప్పుడు ఉంటారు.* ఈ లోకము ఎక్కడికో ఒక చోటికి కదలివెళ్తుందనే విషయాన్ని క్రైస్తవులు ఎరిగియున్నారనేది క్రైస్తవుల లౌకిక దృష్టికోణం మరియు అవిశ్వాసుల దృష్టికోణానికి మధ్య గల అత్యంత ప్రాముఖ్యమైన భేదములలో ఒకటై యున్నది. అదొక ముగింపు దిశగా, ప్రతి ఒక్కరు దేవుని యెదుట నిలువబడి లెక్క ఒప్పజెప్పే తీర్పు దిశగా పరుగులు తీస్తుంది (2 కొరింథీయులకు 5:10). వారు సృష్టిలో చూచుచున్న ప్రక్రియలకు ఆవల ఏమియు లేదనే విషయాన్ని అవిశ్వాసులు విశ్వసిస్తున్నారు. అంతా కాకతాళీయంగా సంభవిస్తున్న సంఘటనయే. లోకము ఒక పెద్ద విస్ఫోటకముతో లేదా ఒక మూలుగుతో అంతం

కావచ్చు; కాని అది అంతమైనప్పుడు, అంతా నిరర్థకమే ఔతుంది. అవిశ్వాసి విషయంలో, మానవ జీవితము మరియు భౌతిక లోకము రోదసీకి సంబంధించిన ఏదో ఒక విధమైన ప్రమాదం మాదిరిగా నున్నది. దానికొక రూపం లేదు, ఒక ప్రణాళిక లేదు. వారికైతే, పౌలు చెప్పుతున్నట్లుగా, ప్రజలు "రేపు చనిపోదుము, గనుక తిందుము త్రాగుదము" అని చెప్పుకొనుచుండునదై యుండవచ్చు (1 కొరింథీయులకు 15:32). అట్లయినను తప్పేమీ చేయరు. అది క్రైస్తవులు ఏదో "గ్రుడ్డి నమ్మకము" కలిగియున్నారు మరియు అనుమానితులకు విశ్వాసము లేదన్నటువంటిది కాదు. అవిశ్వాసులు వారి నిత్యత్వము విషయంలో వారి అనుమానాలనుబట్టి ప్రమాదంలో పడిపోతున్నారు. దేవుడు తనను తాను బయలుపర్చుకున్నాడని క్రైస్తవులు విశ్వసిస్తున్నారు. అంతమాత్రమే కాదు, దేవుడు యేసు క్రీస్తునందు ఈ లోకానికి విమోచకుడుగా వచ్చాడని నమ్మడానికి కారణమున్నది. హేళనచేయు అనుమానితులు ఎల్లప్పుడు ఉంటారు. ఇది ఎదురుచూడబడాల్సిన విషయమే అనే సంగతిని తన పాఠకులు తెలిసికోవాలని పేతురు ఆశించాడు. యేసు మృతులలో నుంచి తిరిగి లేచి దేవుని కుడి పార్శ్వమున కూర్చుండి ఏలుచున్నాడనే విషయాన్ని అనుమానం గాని మరియు ఎగతాళి గాని ఏ మాత్రమును మార్చజాలవు. ఆయన తిరిగి వచ్చునను అభయమును సహితం అవి మార్చవు.

(2) *దేవుడు దీర్ఘశాంతమును ప్రదర్శించు సహనముగల చరిత్రగలవాడై యున్నాడు: కాని చివరకు, తన వాగ్దానముల ప్రకారమైన కార్యాలను ఆయన జరిగిస్తాడు.* పేతురు క్రైస్తవులకు వెనుకటి జలప్రళయ కాలమును సూచించాడు. నోవహును, తాను రచించిన రెండు చిన్న పత్రికలలో పేతురు ముమ్మారు గుర్తుచేసాడు (1 పేతురు 3:19-20; 2 పేతురు 2:5; 3:5, 6). పాపము విషయంలో దేవుడు లోకమును బాధ్యతాయుతమైనదానిగా ఎంచుతున్న విషయాన్ని అపొస్తలుడు ప్రతిసారి ప్రస్తావించాడు. చివరి సందర్భంలో (3:5, 6) దేవుడు, ఈ రోజున తీర్పును ప్రకటించిన మరుసటి రోజున తీర్పు తీర్చలేదనే విషయాన్ని ఆయన విశ్వాసులకు జ్ఞాపకం చేస్తున్నాడు. నోవాహు లోకము మీద నేరస్థాపన చేసి "నీతికి వారసుయ్యాడు" (హెబ్రీయులకు 11:7). అయితే లోకము అతని మాటలను పట్టించుకొలేదు. సంవత్సరాలు గతించాయి, కాని చివరకు దేవుడు ఆయన అదివరకే ప్రకటించిన ప్రకారం తీర్పు తీర్చాడు.

పేతురు ఇలాంటివి యింకా ఎన్నో ఉదాహరణములు ఎత్తి చూపించి యుండవచ్చు. దేవుడు దేశానికి తీర్పు తీరుస్తాడంటూ ప్రవక్తయైన యిర్మీయా దశాబ్దాల తరబడి యూదా మరియు యెరూషలేము దేశ ప్రజలను హెచ్చరించాడు. కొద్దిమంది మాత్రమే ఈ మాటలను చెవినిబెట్టారు. మారుమనస్సు నొందటానికి ప్రజలకు చాలినంత కంటె ఎక్కువ తరుణం ఉండింది. అయితే ప్రజలు మారుమనస్సు నొందుటకు బదులుగా, ప్రవక్తను హేళన చేసారు. గనుక యిర్మీయా నిరుత్సాహపడ్డాడు, చివరకు ప్రవక్త చేయాల్సిన పని మానివేయాలనుకున్నాడు (యిర్మీయా 20:7). చివరకు, దేవుడు ప్రజలకు తీర్పు తీర్చాడు. యెరూషలేము నాశనమయ్యింది; ప్రజలు హతమార్చబడ్డారు లేదా బానిసలుగా చెరపట్టబడ్డారు. దేవుడు ప్రజల యెడల దీర్ఘశాంతం ప్రదర్శిస్తాడు, కాని ఆయన వాగ్దానములు అవశ్యముగా నెరవేరును.

(3) *మానవాళి యొక్క అంగరంగ వైభవము మరియు మహిమ అంతా దేవుని తీర్పు*

*క్రిందకు వస్తుంది.* అవిశ్వాసులైనవారు కలిగియుండు పరస్పర వైరుధ్యం తరచుగా వింతైనదై యుంటుంది: మొదటిగా, మానవ జీవితం జీవశాస్త్ర సంబంధమైన, పరిణామ సంబంధమైన శృంఖలము యొక్క అంతము కంటె ఎక్కువైనదేమీ కాదని వారు ఊహించుకుంటారు. మానవుడై యుండటం, దాని వర్గమునకు సంబంధించినంత వరకు ఒక కుమ్మరిపురుగు లేదా ఒక కోతియై యుండటం కంటె భిన్నమైనదేమీ కాదు. హేతుబద్ధంగా మనిషి మరణం, పొలంలోని ఎలుక చావు కంటె ఎక్కువైనదేమి కాదు. ఒక అవిశ్వాసి యొక్క పూరాభిప్రాయాన్ని పరిగణలోనికి తీసికొని, మానవ జాతి ఈ భూగ్రహంపై ఒక వ్యాధియై యున్నది, అది జీవావరణమును తారుమారుచేస్తున్నది, మరియు ఇతర జీవరూపములను నాశనం చేస్తున్నదంటూ వస్తుగతమైన పరిశీలకుడు తర్కించవచ్చు. ఇవేవీ లేకుంటేనే ఈ భూగ్రహం శ్రేష్ఠమైందిగా ఉంటుంది.

అవిశ్వాసులు సరియైనట్లయితే, వారు ఈ తుది అభిప్రాయాలను ఎలా ఏర్పరచుకుంటారో ఒకడు అర్థం చేసికొనవచ్చు. అట్లయినను ఇదే అవిశ్వాసులు, మానవ జీవితానికి అర్థమేలేదని చెప్పుతూనే, అంతా మానవ జీవితమే అయియున్నట్టు చేయాలని ఆశిస్తారు. నేటికిని ప్రజలు వారు ఆకాశము నంటునట్లు నిర్మించుకుంటున్న గోపురముల వైపు చూస్తూ (ఆదికాండము 11:4) వారు సాధించిన విషయాల గూర్చి అబ్బురపడుతుంటారు. "ఆకాశము నంటుచున్నట్టు అగుపించు మన భవంతులు, మన చమురు టాంకర్లు, మన రోదసీ నౌకలు, దూర ప్రాంతాలకు పెట్రోలును చేరవేసే మన గొప్ప గొట్టములు, మన రోడ్లు మరియు వంతెనలు ఎంత గంభీరమైనవై ఉన్నాయో చూడండి. మనము ఎంతో ఆశ్చర్యకరమైన జాతియై యున్నాము. మనము సాధించలేనిదంటూ ఏదీ లేదని" వారు చెప్పుచుందురు.

మానవులు తమ్మును తామే వారి సొంత దేవతలనుగా చేసికొనుచున్నారు. మానవులు సాధించిన విషయాలనుబట్టి అతిశయించువారికి మనము మానవ జాతి సాధించలేకుండిన విషయాలను జ్ఞాపకంచేయవచ్చు. మనము ఒకరినొకరము చంపుకొనడాన్ని ఆపుజేయలేకపోతున్నాము. యుద్ధాలు చెలరేగుతునే ఉన్నాయి. ద్వేషం దాని విషాన్ని వీధుల్లోను, వీధుల్లోని గృహాల్లోను వెల్లగ్రక్కుతుంది. పిల్లలు మాదకద్రవ్యాలకు బానిసలౌతున్నారు. భార్యాభర్తలు కలిసికట్టుగా జీవించడానికి అవసరమయ్యే సామరస్యమును కనుగొనలేకపోతున్నారు. ఎన్నటికినీ వైదొలగలేకపోతున్న ఆధిపత్యాన్ని చేజిక్కించుకొను వాస్తవమొకటున్నది: ఒక ప్రాచీన పాటలోని మాటలు ఇలా ఉన్నాయి, "లోయలో మనము ఒకరొకరముగా వెళ్తున్నాము."[12] మానవులు దేనినైనా సాధించగలరని నొక్కివక్కాణించే ప్రజలను చావనేది యింకా దాని కైవశం చేసుకుంటూనే ఉన్నది. గనుక పేతురు చేయుచున్న హెచ్చరికను ఏ మాత్రమైనను అలక్ష్యం చేయరాదు. భూమ్యాకాశాలు, మానవ అంగరంగ వైభవము మరియు మహిమ అంతా, నాశనమౌతుంది. దేవుడు ఈ లోకాన్ని ఒక ముగింపుకు తెస్తున్నాడు. గనుక జ్ఞానముగల స్త్రీపురుషులు భక్తిపూర్వకమైన జీవితములు జీవించడమే వారి వంతుకు ఉత్తమం. "ఇవన్నియు ఇట్లు లయమైపోవునవి గనుక, ... మీరు పరిశుద్ధమైన ప్రవర్తనతోను భక్తితోను ఎంతో జాగ్రత్తగలవాడై యుండవలెనని" పేతురు ఘోషించాడు (2 పేతురు 3:11-12).

*ముగింపు.* పేతురు హెచ్చరికలు పరుషమైనవై యుండినవి, కాని అదే సమయంలో

ఆయన ఆశాజనకమైన నిరీక్షణను మన ముందుంచుతున్నాడు. ఈ లోకం అంతమైపోయిన తరువాత, దేవుడు నూతన భూమ్యాకాశములను సృజిస్తాడని ఆయన తన ప్రజలకు తెలియజెప్పాడు. వాటియందు నీతి నివసిస్తుంది (2 పేతురు 3:13). ఈ నూతన భూమ్యాకాశాలు ఎలా ఉంటాయో యని ఊహించుకొనడం గూర్చి పేతురు గాని లేదా క్రొత్త నిబంధన రచయితలలో ఇతరులెవరైనను అనవసరమైన ఊహాకల్పనలను ప్రోత్సహించలేదు. ఎందుకనగా దేవుడు తన జనులకు అవసరమైన వాటిని ఆయనే సమకూర్చును.

### "వాగ్దానమేమాయెను?" (3:4)

క్రైస్తవ విశ్వాసం మొదలైన తొలి రోజుల నుంచే, శంకితులైనవారు ప్రభువు రాకడ సమయము గూర్చి విశ్వాసులైనవారిని ఎత్తిపొడుపు మాటలతో విసిగించుచుండిరి. "ప్రభువు రాకడ విషయం గూర్చి మాటలాడటం మీరెందురు మానివేయకూడదు?" అంటూ స్వాధికారంతో ప్రశ్నించుచుండిరి. శతాబ్దాల తరబడి క్రైస్తవులు ఇట్టి నిరీక్షణను సజీవంగా నిలిపియుంచుతున్నారు. ఒక ప్రాచీన ప్రసంగం బ్రతికి బయటపడింది, అది బహుశా రెండవ శతాబ్దం మధ్య కాలంలో వ్రాయబడిందని తెలుస్తుంది. దాని శీర్షిక, "2 క్లెమెంతు," అయితే దీనిని ఎవరు రాసారో తెలియదు. అది బహు చక్కగా వ్రాయబడిన ప్రసంగమై యున్నది, ఇతర విషయాలతో పాటు, ప్రభువు రాకడ ఆలస్యమగుట గూర్చి అందులో అన్వేషింపబడింది. అది ఈ క్రింది విధంగా చెప్పుతుంది,

> వారు హృదయములో సంశయించు ద్విమనస్కులు, మరియు ఈ విషయాలను మేము చాలా కాలం నుంచి, చెప్పాలంటే మా తండ్రుల కాలం నుంచి వింటూనే ఉన్నాము, మేము దినదినము వేచియుంటిమి. కాని విన్న విషయాల్లో ఒక్కటైనా నెరవేరలేదని చెప్పెడివారు, దౌర్భాగ్యులై యున్నారు. ఓ బుద్ధిహీనులారా! మిమ్మును మీరు ఒక వృక్షంతో పోల్చుకొనండి; ఉదాహరణగా ఒక ద్రాక్షావల్లిని తీసికొనండి; అది మొదట దాని ఆకులు రాల్చుతుంది, ఆ తరువాత ఒక మొగ్గ వేస్తుంది, ఆ తరువాత పరిపక్వంగా పండని ద్రాక్షా పండు వస్తుంది, ఆ తరువాతే నిండు పండ్ల గుచ్ఛము వస్తుంది. అదే విధంగా నా ప్రజలు కలకలములు మరియు విపద్దశలు ఎదుర్కొన్నారు; ఆ తరువాత వారు మంచి విషయాలు అనుభవిస్తారు. కాబట్టి, నా సహోదరులారా, మనము ద్విమనస్కులమై యుండరాదు, కాని మనము కూడ మంచి ప్రతిఫలమును పొందునట్లు సహనముతో కూడిన నిరీక్షణగలవారమై యుందాము.[13]

అది పేతురు కాలములోనైనా, లేక క్లెమెంతు కాలములోనైనా, లేదా వర్తమానకాల తరములోనైనా, ప్రభువు రాకడను సందేహించడానికి లేదా దానిని కొట్టిపారేయడానికి తావిచ్చు శోధన, ప్రతి కాలములోనూ ఉన్నదే. అట్లయినను, ప్రభువు రాకడ గూర్చిన వాగ్దానము మరియు ఆ దినాన ఈ వాగ్దానము నెరవేరుట, క్రైస్తవ సందేశములో ప్రధానంశమై యున్నది. ఆయన ఒకసారి నజరేతు దాసుడుగా వచ్చాడు; ఆయన మరలా ప్రభువులకు ప్రభువుగాను రాజులకు రాజుగాను వస్తాడు. అది అలాగే జరుగునుగాక ఆమేన్.

### జీవితమును దృష్టికోణంలోనికి తెచ్చుకొనుట (3:8–10)

దేవుని దీర్ఘశాంతముతో కూడిన విధానములను పేతురు తన పాఠకులకు జ్ఞాపకం చేసినప్పుడు, సమస్త మానవులు మారుమనస్సు నొందవలెనని ఆయన వాంఛిస్తున్నాడని

వారికి తెలియజెప్పినప్పుడు, అది జీవితము బద్బుదప్రాయమైనది మరియు మరణము నిశ్చయమైనదను సత్యము గూర్చిన ఒక అనుస్మృతియై యుండింది. యేసు క్రీస్తు నందు, మానవాళిని రక్షించుటకును, నిత్యజీవము నిచ్చుటకును, దేవుడు వారికి తనను తాను బయలుపరచుకున్నాడు, సకల మానవులకు ఆయన తన బాహువులను బాహాటంగా చాచాడు. ప్రఖ్యాతిగాంచిన రాజనీతి విశారదుడు మరియు స్తోయికుల తత్వవేత్తయై యుండిన సెనెక, పౌలు సమకాలీనుడై యుండెను. అతడు రోమా పట్టణంలో నివసించాడు. మనకు తెలియుచున్నంత వరకు, క్రైస్తవ సందేశముతో అతనికి పరిచయము లేదు. ఏది ఏమైనా, అతని యొక్క అన్యమతారాధికుల దృష్టికోణం దృష్ట్యా, జీవితానికే అర్థం లేనప్పుడు దాని గూర్చి ప్రయాసపడుటలో గల అన్యోన్య వైరుధ్యం విషయమై సెనెక కూడ మననం చేసాడు.

> రేపటి దినము వాని సొంతం కానప్పుడు సహితం, ఒకడు తన జీవితాన్ని ప్రారంభించటం, అది ఎంత బుద్ధిహీనమైన విషయమవుతుంది కదా! ఓహో, బహుముఖమైన మన ఆశల ప్రణాళికను రచించుకొనుట ఎంత పిచ్చి పట్టిన పరిస్థితియౌతుంది కదా! "నేను కొనుక్కొని కట్టుకుంటాను, బాకీ ఇమ్మని అడుగుతూ రుణ సేకరణతో డబ్బులు పోగేసుకుంటాను, గౌరవ పట్టాలు గెలుచుకుంటాను, ఆ తరువాత, వృద్ధుడనై, నిండుగా నూరేళ్లు నిండినవాడనై నా జీవితాన్ని ఎల్లకాలం ప్రశాంతమైందిగా ఉండే జీవితానికి – మరణానికి – అప్పజెప్పుకుంటానని" చెప్పుకొనడం ఎంత నిరర్థకమైన విషయమవుతుంది కదా! మంగళదాయకంగా వర్ధిల్లుతున్న వారి విషయంలో కూడ, సమస్తమూ సందేహాత్మకమే అని నేను చెప్తుతున్నాను గనుక నా మాటలు నమ్మండి. భవిష్యత్తు గూర్చి ఎవరి ప్రణాళికలు వారు వేసికోడానికి ఏ ఒక్కరికైనను హక్కులేదు … దూర దూర ప్రాంతాలను సందర్శించాలను సదుద్దేశంతో సుదీర్ఘ ప్రణాళికలు వేసుకుంటాము, విదేశీ తీరాల్లో తిరుగుతూ సొంత గూటికి రావడాన్ని వాయిదా వేస్తుంటాము … కాని మరణం అనునిత్యమూ మన ప్రక్కలోనే కాచుకొని కూర్చుంటుంది.[14]

సెనెక చెప్తుతున్న మాటల్లో ఎవ్విధమైన నిరీక్షణయైనను అగుపించడం లేదు. వాటిని చదువుతూ వుంటే, జాలేస్తుంది. పేతురు విషయంలోనైతేనేమి, ఆయన మాటలు నమ్ముతూ ప్రభువునందు విశ్వసిస్తున్న వారి విషయంలోనైతేనేమి, మన ప్రక్కలో నిల్చొని ఉన్నది జీవం, మరణం కాదని ఆయన ఘోషించాడు. వాటి యందు నీతి నివసించే ఒక నూతన ఆకాశము మరియు నూతన భూమి వ్యవస్థాపింపబడును.

### రెండవ రాకడ మరియు నీతి ప్రవర్తన (3:11-13)

అదర్శప్రాయంగా చూస్తే, క్రైస్తవులు దేవునికి లోబడుతూ యేసు క్రీస్తును సేవించడం సరిపోతుంది, ఎందుకనగా మనము చేయవలసిన సరైన సంగతి ఇదే. దేవుడు సృష్టికర్తయై యున్నాడు, అది చాలు మనకు. ఆయన తన ప్రేమను నజరేతువాడైన యేసు నందు చూపించాడు, ఇది చాలు మనకు. ఆదర్శప్రాయంగా, ఆయన ఆధిపత్యమునుబట్టియే మనము ఆయనకు లోబడుతున్నాము, అంతేగాని ఇతరమైన హేతువు లేదు. తీర్పు మరియు నిత్యత్వము గూర్చి జ్ఞాపకం చేయాల్సిన అవసరం లేదు.

ఒప్పునకు బహుమానము, తప్పునకు శిక్ష యనే విధానమును ఉపయోగిస్తూ భక్తిపూర్వకమైన జీవితం విషయమై దేవుడు విన్నవిస్తున్న బలమైన శరీరేచ్ఛలను అదొక

రాయితీయై యున్నది. ఒక ప్రక్క దేవుడు ప్రేమయై యున్నాడు. దేవుడు ప్రేమామయుడైన తండ్రియై యున్నాడు గనుక క్రైస్తవులు ఆయనకు లోబడుచుందురు మరొక ప్రక్క, దేవుడు దహించు అగ్నియై యున్నాడు. ఆయన న్యాయాధిపతియై యున్నాడు. దేవుడు ఆకాశంలో ఒక భారీ గదను చేత బూని హఠాత్తుగా పాపుల పైనబడి వారిని దెబ్బతీయడానికి సిద్ధంగా ఉన్నాడన్నట్టుగా ఆయన గూర్చి ఆలోచించడం, అదొక అంధకార బంధురమైన చిత్రీకరణమవుతుంది. భక్తుడైన యోహాను, "పరిపూర్ణ ప్రేమ భయమును వెళ్లగొట్టునని" చెప్పడం ద్వారా, ఇటువంటి తప్పుడు భావన నుంచి విశ్వాసులను తప్పించాడు (1 యోహాను 4:18). ఇంకా, క్రైస్తవులకు భయమనేది ప్రోత్సహకమిచ్చుచున్నదనే విషయాన్ని పూర్తిగా కొట్టిపారేయలేము. వంచించెడి ఆకర్షణీయమైన పాపపు వాంఛల దృష్ట్యా, మన సమస్త నోటి మాటలు మరియు క్రియల విషయంలో దేవుడు మనలను ప్రతి ఒక్కరిని లెక్క అడుగుననే విషయాన్ని జ్ఞాపకముంచుకొనాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. దేవుడు న్యాయాధిపతియై యున్నాడనే విషయాన్ని విశ్వాసులకు జ్ఞాపకం చేయడానికి పాత నిబంధన మరియు క్రొత్త నిబంధనలోని పరిశుద్ధులు ఏ మాత్రమును వెనుకంజ వేయడం లేదు. ఈ సాంప్రదాయం ప్రకారమే, ప్రభువు తిరిగి వచ్చుట గూర్చియు, అంత్య తీర్పు గూర్చియు పేతురు సూచించాడు. క్రీస్తు న్యాయధిపతిగా తిరిగి రానైయున్నందు వలన, వారు పరిశుద్ధమైన ప్రవర్తనతోను భక్తితోను ఎంతో జాగ్రత్తగలవారై జీవించవలెనని పేతురు క్రైస్తవులకు జ్ఞాపకంచేసాడు.

---

సూచికలు

[1]Donald Guthrie, *New Testament Theology* (Downers Grove, Ill.: Inter-Varsity Press, 1981), 978. [2]అపొస్తలులు, "పన్నెండుగురు" అని అపొస్తలుల కార్యముల పుస్తకంలో ఒక్క మారు (6:2) మరియు పౌలు చేత ఒక్కసారి మాత్రమే (1 కొరింథీయులకు 15:5) సంబోధింపబడ్డారు. విధ్యుక్తంగా "పండ్రెండుగురు"లో లేనివాడైనప్పటికిని, పౌలు సంపూర్ణ అధికారముగల అపొస్తలుడుగా నియమింపబడినవాడై యుండెను (గలతీయులకు 1:1). [3]Michael Green, *The Second Epistle General of Peter and the General Epistle of Jude,* rev. ed., Tyndale New Testament Commentaries, vol. 18 (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1987), 138. [4]Everett Ferguson, *Backgrounds of Early Christianity,* 2d ed. (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1993), 232. [5]John R. Clements, "In the Land of Fadeless Day," *Songs of the Church,* comp. and ed. Alton H. Howard (West Monroe, La.: Howard Publishing Co., 1977). [6]Irenaeus *Against Heresies* 5.28.3. [7]Richard J. Bauckham*, Jude, 2 Peter,* Word Biblical Commentary, vol. 50 (Waco, Tex.: Word Books, 1983), 312. [8]Charles H. H. Scobie, *The Ways of Our God: An Approach to Biblical Theology* (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 2003), 741. [9]Robert Davidson, "Some Aspects of the Old Testament Contribution to the Pattern of Christian Ethics," *Scottish Journal of Theology* 12 (December 1959): 376. [10]ఈ వచనంలో, అనగా 2 పేతురు 3:14, అపొస్తలుడు (*amōmētos*, "నిష్కళంకమునగు" లేక "కళంకములేని")ను 1 పేతురు 1:19లోని amōmos బదులుగా ఉపయోగించాడు, యేసు "నిష్కళంకమునగు" గొఱ్ఱెపిల్లయై యుండెనని చెప్పెను. ఈ రెండు పదములు కూడ సన్నిహితమైనవై ఉన్నాయి మరియు ఒకే అర్థము నిచ్చుచున్నవి.

[11]*Shepherd of Hermas: Similitudes* 9.14.4. [12] Jessie Brown Pounds, "We Are Going Down the Valley," *Songs of the Church,* comp. and ed. Alton H. Howard (West Monroe, La.: Howard Publishing Co., 1977). [13]*2 Clement* 11.2–5. [14]Seneca *Epistles* 101.